

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 20-08-2026 | సంపుటి - 31 | సంచిక - 87 | రూ : 4 | పేజీలు : 8


## 'ఇందిరమ్మ' రెండో విడతకు వేగంగా కసరత్తు



- వచ్చే నెల 15 నాటికి ఇళ్ల లబ్ధిదారులకు పత్రాలు
- ఒక్కో నియోజక వర్గంలో 2,500 మందికి కేటాయింపులు

హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడత లబ్ధిదారులను సెప్టెంబరు 15 నాటికి ఎంపిక చేసి, మంజూరు పత్రాలు అందించేలా హౌసింగ్ కార్పొరేషన్ ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే 2.50 లక్షల ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. క్యూర్ పరిధి మినహాయించి రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 2,500 చొప్పున ఇళ్లను నిర్మించి ఇవ్వనుంది. రాష్ట్రవ్యాప్తంగా తరువాయి 2లో

# మంత్రి కొండా సురేఖకు షోకాజ్

## కుమార్తె వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలన్న క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ

- చిన్నారెడ్డి, ఆదిలాబాద్ ఇన్‌ఛార్జి కందికి సైతం నోటీసులు
- ఎల్బీనగర్ సీనియర్ నేత జక్కిడి సస్పెన్షన్
- నేతల మధ్య విభేదాలు, పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్న ఏఐసీసీ



హైదరాబాద్: కాంగ్రెస్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న సొంత పార్టీ నేతల తీరును అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీని బద్నాం చేసేలా వ్యవహరిస్తున్నందున వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తాజాగా ఆదేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కుమార్తె సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ వివరణ కోరుతూ కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ(డీఏసీ) బుధవారం షోకాజ్ నోటీసులు జారీచేసింది. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, అదే మున్సిపాలిటీ కౌన్సిలర్ సంజయ్‌లకు సైతం నోటీసులు ఇచ్చింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఎల్బీనగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. పలువురిని వ్యక్తిగత విషయాలపై కులాల పేరుతో దూషించిన ఘటనలపై ఆధారాలుండడంతో జక్కిడిపై చర్యలు తీసుకున్నట్లు కమిటీ తెలిపింది.

**మంత్రి కుమార్తె వ్యవహారశైలితో..**

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత నేరుగా సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి గతంలో ఒకసారి, ఇప్పుడు మళ్లీ సీఎంపై, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై విమర్శలు చేయడాన్ని పార్టీ తీవ్రంగా పరిగణిస్తోంది. మంత్రి కుటుంబ సభ్యురాలే ఇలా పార్టీని, ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలుచేసేలా మాట్లాడితే ఇక కార్యకర్తలకు ఏం చెబుతారని పార్టీ ప్రశ్నించినట్లు సమాచారం. గతంలో సుస్మిత ఆరోపణలు చేసినప్పుడే చర్యలు తీసుకుని ఉంటే ఇప్పుడు మళ్లీ మాట్లాడటానికి అవకాశం ఉండేది కాదని నేతలు చెబుతున్నారు. ఇంతవరకూ పార్టీలో ప్రత్యక్షంగా పనిచేయకుండానే నేరుగా తనకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ తరువాయి 2లో

## వచ్చే 6 నెలల్లో కొత్త చాట్‌జీపీటీ?

### స్క్రీన్ నుంచి మీటింగ్స్ వరకు అన్నీ గమనించే ఏఐ




- స్క్రీన్, మీటింగ్స్, కాల్స్‌ను ఏఐ అర్థం చేసుకోనుందని వెల్లడి
- ఏ సమాచారాన్ని పంచుకోవాలో వినియోగదారుడే నిర్ణయించుకోవచ్చని వివరణ
- మెయిల్స్, డాక్యుమెంట్లు, స్లాక్ వంటి వనరులకు యాక్సెస్ ఇవ్వొచ్చని వెల్లడి
- పని చేస్తుండగానే ఏఐ సూచనలు ఇవ్వగలదన్న ఆల్ట్‌మన్
- అనుమతి ఇస్తే కొన్ని పనులను ఏఐ స్వయంగా పూర్తి చేయగలదని వెల్లడి

## 6వ తరగతి పాఠ్యపుస్తకంలో ఏఐ, పైథాన్ పాఠాలు




- ముంబై మహిళ షేర్ చేసిన వీడియో ఇంటర్నెట్‌లో వైరల్
- మనం 20 ఏళ్లు వెనకబడ్డామంటూ నెటిజన్ల కామెంట్లు
- సీబీఎస్‌ఈ కొత్త విధానం ప్రకారమే సిలబస్‌లో మార్పులు

2లో

## ఎన్టీపీలో సమూల ప్రక్షాళన..

## 600 మంది నిపుణుల తొలగింపు

## యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో సంపాదిస్తున్నారా?

### ఆగస్టు 31 మిస్ అయితే ఇబ్బందే!

- సోషల్ మీడియా ఆదాయానికీ పన్ను నిబంధనలు
- ఆగస్టు 31 ఐటీఆర్ దాఖలుకు కీలక గడువు
- యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ ఆదాయాలన్నీ లెక్కించాలి
- అఫిలియేట్, మెంబర్‌షిప్ ఆదాయాలనూ చూపించాలి
- కొందరికి జీఎస్‌టీ, టీడీఎస్ నిబంధనలు వర్తించొచ్చు




ఒకప్పుడు సోషల్ మీడియాలో వీడియోలు చేయడం సరదా. ఇప్పుడు అదే వీడియోలు చాలామందికి పూర్తిస్థాయి ఆదాయ మార్గం. యూట్యూబ్ యాడ్స్ నుంచి వచ్చే డబ్బు.. ఇన్‌స్టాగ్రామ్ బ్రాండ్ డీల్స్.. అఫిలియేట్ కమీషన్లు.. మెంబర్‌షిప్‌లు.. సూపర్‌చాట్లు.. ఒక్కో మార్గం నుంచి ఒక్కో రూపంలో ఆదాయం వస్తోంది. అయితే ఈ సంపాదనకు లెక్క చెప్పాల్సిన అవసరం లేదని అనుకుంటే మాత్రం పొరపాటే. కంటెంట్ క్రియేటర్లకు ఆగస్టు 31 కీలక గడువు. అసలు ఏం చేయాలి? ఏ ఆదాయాన్ని ఎలా చూపించాలి?

**సోషల్ మీడియా సంపాదనకూ పన్ను**

కంటెంట్ క్రియేషన్ క్రమం తప్పకుండా చేస్తూ దాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుంటే.. ఆ సంపాదన సాధారణంగా వ్యాపారం లేదా వృత్తి నుంచి వచ్చిన ఆదాయంగా పరిగణిస్తారు. యూట్యూబ్ యాడ్‌సెన్స్, ఇన్‌స్టాగ్రామ్ బ్రాండ్ ప్రమోషన్లు మాత్రమే కాదు. అఫిలియేట్ లింకులు, ప్లాట్‌ఫామ్ చెల్లింపులు, మెంబర్‌షిప్‌లు, సూపర్‌చాట్లు, మెర్చండైజ్ అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బునూ లెక్కలోకి తీసుకోవాలి.

**ఆగస్టు 31 ఎందుకు కీలకం?**

తరువాయి 2లో

## రష్యాలో డ్రోన్ దాడి..

## భారత వైద్య విద్యార్థికి గాయాలు

- రష్యాలోని ఉఫాలో డ్రోన్ దాడిలో భారత విద్యార్థికి గాయాలు
- బష్కిర్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో చదువుతున్న బాధితుడు
- విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉందని ప్రకటించిన భారత ఎంబసీ



రష్యా-ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో, రష్యాలోని ఉఫా నగరంలో జరిగిన డ్రోన్ దాడిలో ఒక భారతీయ విద్యార్థి గాయపడ్డారు. ప్రస్తుతం బాధితుడు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని మాస్కోలోని భారత రాయబార కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఉఫాలోని బష్కిర్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న ఈ విద్యార్థిపై డ్రోన్ దాడి జరిగినట్లు సమాచారం. ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం (ఎంబసీ) తక్షణమే స్పందించింది. గాయపడిన విద్యార్థితో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, స్థానిక అధికారులతో సమన్వయం తరువాయి 2లో

## గ్రీన్ కార్డ్ ఆశావహులకు షాక్..

## సెప్టెంబర్ 18 నుంచి కొత్త రూల్స్..

- 'పబ్లిక్ ఛార్జ్' నిబంధన కింద దరఖాస్తుదారుల ఆర్థిక స్థితిపై విస్తృత పరిశీలన
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందిన వారిపై ప్రధానంగా ప్రభావం
- వేలాది మంది భారతీయులకు వర్తించనున్న కొత్త రూల్స్
- నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకున్న వారికి పాత




**నిబంధనల ప్రకారమే గ్రీన్ కార్డ్**

అమెరికాలో శాశ్వత నివాసం (గ్రీన్ కార్డ్) కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది భారతీయులపై ప్రభావం చూపే కీలక మార్పులు రాబోతున్నాయి. 'పబ్లిక్ ఛార్జ్' నిబంధనను పునరుద్ధరిస్తూ అమెరికా ప్రభుత్వం జారీ చేసిన కొత్త మార్గదర్శకాలు సెప్టెంబర్ 18 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ కొత్త నిబంధనల ప్రకారం.. గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు తరువాయి 2లో

# మంత్రి కొండా సురేఖకు షోకాజ్

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న సొంత పార్టీ నేతల తీరును అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీని బద్నాం చేసేలా వ్యవహరిస్తున్నందున వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తాజాగా ఆదేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కుమార్తె సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ వివరణ కోరుతూ కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ (డీఏసీ) బుధవారం షోకాజ్ నోటీసులు జారీచేసింది. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, అదే మున్సిపాలిటీ కౌన్సిలర్ సంజయ్‌లకు సైతం నోటీసులు ఇచ్చింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఎల్బీనగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. పలువురిని వ్యక్తిగత విషయాలపై కులాల పేరుతో దూషించిన ఘటనలపై ఆధారాలుండడంతో జక్కిడిపై చర్యలు తీసుకున్నట్లు కమిటీ తెలిపింది.

**మంత్రి కుమార్తె వ్యవహారశైలితో..**

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత నేరుగా సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి గతంలో ఒకసారి, ఇప్పుడు మళ్లీ సీఎంపై, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై విమర్శలు చేయడాన్ని పార్టీ తీవ్రంగా పరిగణిస్తోంది. మంత్రి కుటుంబ సభ్యురాలే ఇలా పార్టీని, ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేలా మాట్లాడితే ఇక కార్యకర్తలకు ఏం చెబుతారని పార్టీ ప్రశ్నించినట్లు సమాచారం. గతంలో సుస్మిత ఆరోపణలు చేసినప్పుడే చర్యలు తీసుకుని ఉంటే ఇప్పుడు మళ్లీ మాట్లాడటానికి అవకాశం ఉండేది కాదని నేతలు చెబుతున్నారు. ఇంతవరకూ పార్టీలో ప్రత్యక్షంగా పనిచేయకుండానే నేరుగా తనకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ ఇచ్చి తీరాలని ఏ హోదాతో సుస్మిత అడుగుతారని..?, ఇలా పార్టీని బెదిరించే ధోరణిలో మాట్లాడటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు పీసీసీ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో కుమార్తె వ్యాఖ్యలపై సురేఖను డీఏసీ వివరణ కోరింది.

**చిన్నారెడ్డి తీరుపై ఎమ్మెల్యే ఫిర్యాదులు**

గత అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు తీసుకుని టికెట్లు ఇచ్చారని రాష్ట్ర క్యాబినెట్ మంత్రి హోదాలో ఉన్న చిన్నారెడ్డి ఆరోపణలు చేయడంపై కఠిన చర్యలు తీసుకోవాలని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి... పీసీసీ, డీఏసీ, ఏఐసీసీలకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో చిన్నారెడ్డి ఆరోపణలను తీవ్రంగా పరిగణించి.. వెంటనే విచారణ చేయాలని డీఏసీకి చెప్పడంతో పాటు, ఏఐసీసీకి కూడా వివరాలు పంపినట్లు పీసీసీ వర్గాలు తెలిపాయి. చిన్నారెడ్డికి గత అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక పరిస్థితులతో టికెట్ ఇవ్వలేకపోయిన కారణంగానే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవిని ఇచ్చినా ఇలా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటాన్ని ఏఐసీసీ తీవ్రంగా పరిగణిస్తోంది.

## రష్యాలో డ్రోన్ దాడి.. భారత వైద్య విద్యార్థికి గాయాలు

(మొదటిపేజీ తరువాయి)

చేసుకుంటూ అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా సదరు విద్యార్థికి సంబంధించిన వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచారు. గత మూడు రోజులుగా రష్యా భూభాగంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులను తీవ్రతరం చేసింది. ఈ క్రమంలో, మాస్కోకు సుమారు 1,200 కిలోమీటర్ల దూరంలో ఉన్న కీలక పారిశ్రామిక నగరం ఉఫా లక్ష్యంగా దాడులు కొనసాగుతున్నాయి. ఇక్కడి చమురు శుద్ధి కర్మాగారంపై సైతం దాడులు జరిగినట్లు వార్తలు వెలువడుతున్నాయి.

## 'ఇందిరమ్మ' రెండో విడతకు వేగంగా కసరత్తు

హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడత లబ్ధిదారులను సెప్టెంబరు 15 నాటికి ఎంపిక చేసి, మంజూరు పత్రాలు అందించేలా హౌసింగ్ కార్పొరేషన్ ఏర్పాట్లు చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే 2.50 లక్షల ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. క్యూర్ పరిధి మినహాయించి రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 2,500 చొప్పున ఇళ్లను నిర్మించి ఇవ్వనుంది. రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మంది వరకు గుడిసెల్లో నివసిస్తున్నట్లు అధికారుల సర్వేలో తేలింది. రెండో విడతలో వీరందరికీ మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అలాగే, 'రూఫ్ పునఃప్రారంభం' అనే కొత్త పథకం పేరుతో నియోజకవర్గానికి 700 చొప్పున 70 వేల ఇళ్లు మంజూరు చేయనున్నారు. తుది జాబితాను కలెక్టర్ పరిశీలించిన తర్వాత దస్త్రం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వద్దకు వెళ్తుంది. మంత్రి ఆమోదించాక లబ్ధిదారుల పేర్లను అధికారికంగా ప్రకటిస్తారు. ఈ ప్రక్రియ అంతా సెప్టెంబరు 15 నాటికి పూర్తయ్యేలాకసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వం రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.10,400 కోట్లను కేటాయించింది. ఇందులో 1.80 లక్షల ఇళ్లకు ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున రూ.9 వేల కోట్లను, రూఫ్ ఆధునికీకరణలో భాగంగా 70 వేల ఇళ్లకు రూ.2 లక్షల చొప్పున రూ.1,400 కోట్లను అందించనుంది. మహిళా సంఘాల ద్వారా రూ.లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5 లక్షలను నాలుగు దశలో ఇవ్వనుంది. పునాది దశ దాటిన తర్వాత మొదటి విడత రూ.లక్షను అందిస్తారు. అయితే ఇందిరమ్మ ఇళ్ల మొదటి విడతలో భాగంగా చాలామంది పేదలు పునాది వరకు ఇళ్లను నిర్మించుకోవడంలో ఆర్థికంగా ఇబ్బంది పడ్డారు. ఈసారి ఆ పరిస్థితి తలెత్తకుండా మహిళా సంఘాల ద్వారా లబ్ధిదారులకు రూ.లక్ష రుణం ముందే ఇచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పునాది దశ దాటిన తర్వాత ప్రభుత్వం నుంచి జమయ్యే రూ.లక్షను లబ్ధిదారులు మహిళా సంఘానికి తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

## 6వ తరగతి పాఠ్యపుస్తకంలో ఏఐ, పైథాన్ పాఠాలు

ముంబై మహిళ ఒకరు షేర్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టిస్తోంది. 6వ తరగతి పాఠ్యపుస్తకంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), పైథాన్, మెషీన్ లెర్నింగ్ వంటి పాఠ్యాంశాలు ఉండటాన్ని చూసి ఎంతోమంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. "మేం ఇప్పటి విద్యార్థుల కన్నా 20 ఏళ్లు వెనకబడిపోయాం" అంటూ సరదాగా కామెంట్లు చేస్తున్నారు. ఖుషీ జెస్వానీ అనే మహిళ ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ వీడియోను పోస్ట్ చేశారు. ఆమె ఓ 6వ తరగతి పాఠ్యపుస్తకాన్ని తిరగేస్తూ అందులోని పాఠ్యాంశాలను చూసి నివ్వెరపోయారు. "మనం ఇప్పుడు నేర్చుకుంటున్న పైథాన్, ఏఐ వంటివి 6వ తరగతి పిల్లలకు అప్పుడే సిలబస్‌లో ఉన్నాయి. మెషీన్ లెర్నింగ్, డేటా విజువలైజేషన్, న్యూరల్ నెట్‌వర్క్స్.. ఇవన్నీ ఏంటి? ఇంజనీర్లమైన మన పరిస్థితి ఏంటి?" అంటూ ఆమె ఆ వీడియోలో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "6వ తరగతిలో ఏఐ ఎక్కడి నుంచి వచ్చింది?" అనే టెక్స్ట్‌ను వీడియోపై జతచేశారు. ఈ వీడియో చూసిన నెటిజన్లు తమ పాఠశాల రోజుల నాటి కంప్యూటర్ క్లాసులను గుర్తు చేసుకుంటూ కామెంట్లు పెడుతున్నారు. "నేను 20 ఏళ్లు వెనక నడుస్తున్నాను" అనే కామెంట్ ఈ చర్చకు అద్దం పడుతోంది. భవిష్యత్ టెక్నాలజీ ప్రపంచానికి ఇప్పటి పిల్లలను చాలా ముందుగానే సిద్ధం చేస్తున్నారని పలువురు అభిప్రాయపడ్డారు. అయితే, పాఠ్యాంశాల్లో ఈ మార్పుల వెనుక స్పష్టమైన కారణం ఉంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ), 2026 27 విద్యా సంవత్సరం నుంచి 3 నుంచి 8వ తరగతి విద్యార్థులకు కంప్యూటేషనల్ థింకింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే ఏఐపై అవగాహన కల్పించడం, నైతిక విలువలతో కూడిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడమే దీని లక్ష్యం. ఒకప్పుడు ఇంజనీరింగ్ చదివే వారికి మాత్రమే తెలిసిన అంశాలు ఇప్పుడు ప్రాథమిక విద్యలో భాగం కావడం గమనార్హం.

## వచ్చే 6 నెలల్లో కొత్త చాట్‌జీపీటీ? స్క్రీన్ నుంచి మీటింగ్స్ వరకు అన్నీ గమనించే ఏఐ

మీరు కంప్యూటర్‌లో ఏం చేస్తున్నారు? ఎవరితో మీటింగ్‌లో ఉన్నారు? ఏం టైప్ చేస్తున్నారు? ఏ మెయిల్ రాస్తున్నారు? ఇవన్నీ అర్థం చేసుకుని అవసరమైన సమయంలో సాయం చేసే ఏఐ అసిస్టెంట్ వస్తే ఎలా ఉంటుంది? భవిష్యత్తులో చాట్‌జీపీటీ ఇలాంటి సామర్థ్యాలతో రావచ్చని ఓపెన్‌ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్ తెలిపారు.

**స్క్రీన్‌పై ఏం జరుగుతుందో గమనిస్తూ..**

జెడ్ ఫెలోస్ వ్యవస్థాపకుడు కోరీ లెవీతో జరిగిన ఇంటర్వ్యూలో ఆల్ట్‌మన్ ఈ విషయాలను వెల్లడించారు. భవిష్యత్ చాట్‌జీపీటీ వినియోగదారుడి కంప్యూటర్ స్క్రీన్, మీటింగ్స్, కాల్స్‌ను నిరంతరం గమనిస్తూ సందర్భాన్ని అర్థం చేసుకునే స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. ఇది ఆరు నెలల్లో అందుబాటులోకి రావచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

**అవసరమైన సమాచారానికే యాక్సెస్**

వినియోగదారులు ఏ సమాచారాన్ని ఏఐతో పంచుకోవాలో వారే నిర్ణయించుకోవచ్చని ఆల్ట్‌మన్ తెలిపారు. టెక్స్ట్ మెసేజ్‌లు, ఈమెయిల్స్, డాక్యుమెంట్లు, స్లాక్ వంటి వనరులకు యాక్సెస్ ఇచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. ఏఐ స్వయంగా నిర్ణయాలు తీసుకోదని.. వినియోగదారుడితో కలిసి పనిచేస్తూ సూచనలు ఇవ్వడం, అనుమతి ఉన్న పనులను పూర్తి చేయడం చేస్తుందని వివరించారు.

**పని చేస్తూనే సూచనలు**

ఉదాహరణకు ఓ స్టార్టప్ సీఈఓ కస్టమర్‌కు సేల్స్ పిచ్ రాస్తున్నారని అనుకుందాం. గతంలో ఆ కస్టమర్‌తో జరిగిన సంభాషణలు, సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించి ఏఐ అక్కడికక్కడే మెరుగైన సూచనలు ఇవ్వగలదు. వ్యూహాత్మక డాక్యుమెంట్ తయారుచేస్తున్నప్పుడు తప్పును గుర్తించి హెచ్చరించవచ్చు. అవసరమైతే అనుమతితో సంబంధిత పనిని కూడా పూర్తి చేయగలదు.

**ఒక్కో ప్రశ్నకు సమాధానం దాటి..**

ప్రస్తుతం ఏఐకి ఇచ్చిన ప్రశ్నకు సమాధానం చెప్పడం మాత్రమే ప్రధాన పని. భవిష్యత్ అసిస్టెంట్ మాత్రం యూజర్ పనితీరును అర్థం చేసుకుని స్పందించగలదని ఆల్ట్‌మన్ తెలిపారు. తాను పని చేసే విధానాన్ని కూడా ఇది మార్చగలదని ఆశిస్తున్నట్లు చెప్పారు. చాట్‌జీపీటీలో ఇప్పటికే గత సంభాషణల ఆధారంగా మెరుగైన సమాధానాలు ఇచ్చే మెమరీ సదుపాయం ఉంది. మ్యాక్ కంప్యూటర్లలో డెస్క్‌టాప్ కార్యకలాపాలను సురక్షితంగా నమోదు చేసి వెతుక్కునే 'కంప్యూటర్ హిస్టరీ' ఫీచర్ కూడా ఉంది. ఇది వినియోగదారుల అనుమతితో మాత్రమే పనిచేస్తుంది.

## ఎన్టీఏలో సమూల ప్రక్షాళన.. 600 మంది నిపుణుల తొలగింపు

ఇటీవలి వివాదాల నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) పరీక్షల నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ చర్యలు చేపట్టింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఆదేశాల మేరకు ఎన్టీఏలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఏకంగా 600 మంది నిపుణులను తొలగించి, వారి స్థానంలో కొత్త నిపుణులను నియమించనున్నారు. పరీక్షల నిర్వహణను సురక్షితంగా, పారదర్శకంగా మార్చడమే లక్ష్యంగా ఈ సంస్కరణలు చేపడుతున్నారు. మంత్రి ప్రహ్లాద్ జోషి ఇటీవల ఎన్టీఏ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పరీక్షలను సజావుగా, సురక్షితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా, మౌలిక సదుపాయాల ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ చేపడుతున్న చర్యలను మంత్రికి వివరించారు. ఇప్పటికే 50 మందికి పైగా సిబ్బందిని తొలగించామని, రాబోయే రెండు మూడు వారాల్లో మరో 20 నుంచి 25 మంది కొత్త అధికారులను నియమించనున్నామని తెలిపారు. పరీక్షల విధానంలో పటిష్టత కోసం పలు కీలక మార్పులు చేస్తున్నారు. ప్రశ్నపత్రాల్లో పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఉండేందుకు, వాటి పరిశీలనను బలోపేతం చేయడానికి నాలుగంచెల తనిఖీ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నారు. దీంతో పాటు ఎన్టీఏ కార్యాలయాన్ని ప్రాధాన్యతా క్రమంలో కొత్త ప్రాంగణంలోకి మార్చనున్నారు. కార్యాలయ భద్రతను పటిష్టం చేసేందుకు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) బృందాలను మోహరించాలని నిర్ణయించారు. సంస్థాగత బలోపేతంలో భాగంగా చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్, చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ వంటి 10 కీలక వృత్తిపరమైన నాయకత్వ పదవుల కోసం ఎన్టీఏ ప్రకటనలు జారీ చేసింది. సైబర్ సెక్యూరిటీ, సైకోమెట్రిక్స్, ప్రశ్నపత్రాల రూపకల్పన వంటి ప్రత్యేక రంగాల కోసం ప్రైవేట్ రంగ నిపుణులను కూడా నియమించుకుంటున్నారు. కాన్ఫిడెన్షియల్ ఆపరేషన్స్ (CONOPS) ఆర్కిటెక్చర్‌ను పూర్తిస్థాయిలో మార్చాలని, పరీక్షల నిర్వహణ ప్రక్రియలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి దిద్దుబాటు చర్యలపై నివేదిక ఇవ్వాలని మంత్రి జోషి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో సంపాదిస్తున్నారా? ఆగస్టు 31 మిస్ అయితే ఇబ్బందే!

(మొదటిపేజీ తరువాయి)

202526 ఆర్థిక సంవత్సరానికి వ్యాపారం లేదా వృత్తి నుంచి ఆదాయం పొందుతున్న, ఆడిట్ అవసరం లేని పన్ను చెల్లింపుదారులకు ఆగస్టు 31 ఐటీఆర్ దాఖలు గడువు. క్రియేటర్లు ఒక్కో ప్లాట్‌ఫామ్ నుంచి వేర్వేరు సమయాల్లో చెల్లింపులు పొందుతారు. దీంతో చిన్న మొత్తాలను మర్చిపోయే అవకాశం ఉంటుంది. అందుకే ముందుగానే ఆదాయం మొత్తం నమోదు చేసుకోవడం కీలకం.

**ఏ ఐటీఆర్ దాఖలు చేయాలి?**

క్రియేటర్ ఆదాయం ఎలా వస్తోంది? వ్యాపార నిర్మాణం ఏంటి? పన్ను నిబంధనల ప్రకారం ఏ పద్ధతికి అర్హత ఉంది? అన్నదాన్ని బట్టి ఐటీఆర్ మారుతుంది. అర్హత ఉన్నవారు కొన్ని షరతులకు లోబడి ప్రిజంప్టివ్ ట్యాక్సేషన్ కింద ఐటీఆర్ 4ను ఎంచుకోవచ్చు. మిగతావారు ఐటీఆర్ 3 దాఖలు చేయాల్సి రావచ్చు. అందుకే మరో క్రియేటర్ ఏ ఫారం వాడుతున్నారో చూసి అదే పద్ధతిని అనుసరించడం సరికాదు.

*** జీఎస్టీ, టీడీఎస్ కూడా కీలకమే**

ఆదాయం పెరిగితే కేవలం ఇన్‌కమ్ ట్యాక్స్‌తో వ్యవహారం ముగియదు. టర్నోవర్, సేవల స్వభావాన్ని బట్టి జీఎస్టీ నిబంధనలు వర్తించొచ్చు. బ్రాండ్‌ల నుంచి వచ్చే కొన్ని చెల్లింపులపై టీడీఎస్ కూడా ఉండొచ్చు. కంపెనీలు ఉచితంగా ఇచ్చే ఫోన్లు, కెమెరాలు, ట్రిప్పులు, ఇతర వస్తువులకు కూడా కొన్ని పరిస్థితుల్లో పన్ను ప్రభావం ఉండొచ్చు.

*** వ్యూస్ పెరిగితే ఆదాయం పెరుగుతుందా?**

యూట్యూబ్ ఆగస్టు 24 నుంచి వ్యూస్ లెక్కింపులో మార్పు తీసుకురానుంది. వీడియో ప్లే కావడం మొదలైన వెంటనే వ్యూ లెక్కలోకి వచ్చే విధానం అమల్లోకి రానుంది. దీంతో వ్యూస్ వేగంగా పెరిగినట్లు కనిపించొచ్చు. అయితే దీనివల్ల ఆదాయం ఆటోమేటిక్‌గా పెరగదు. సంపాదన లెక్కల్లో యూట్యూబ్ ఎంగేజ్డ్ వ్యూస్ ప్రమాణాన్ని కొనసాగించనుంది. కంటెంట్ క్రియేషన్‌ను హాబీగా కాకుండా వ్యాపారంగా చూస్తున్నవారు ఆదాయం, ఖర్చులన్నింటికీ సరైన రికార్డులు నిర్వహించడం మంచిది. ఇది పన్ను సమస్యలను తగ్గించడంతో పాటు భవిష్యత్తులో బ్యాంకు రుణాలు, బ్రాండ్ ఒప్పందాలు, పెట్టుబడుల సమయంలోనూ ఉపయోగపడుతుంది.

## ఫొటోగ్రాఫర్‌గా మారిన సీఎం చంద్రబాబు..

సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం కొద్దిసేపు ఫొటోగ్రాఫర్‌గా మారిపోయారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన అసెంబ్లీ ప్రాంగణంలో ఫొటోగ్రాఫర్లతో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్ల కెమెరాను చేతిలోకి తీసుకుని, వారినే క్లిక్ అనిపించారు. వివరాల్లోకి వెళితే.. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో తనను కలిసిన మీడియా ఫొటోగ్రాఫర్లకు చంద్రబాబు తొలుత శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిలో ఒకరి కెమెరాను తీసుకుని వారికి ఫొటోలు తీశారు. తాను తీసిన ఫొటోలను తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు 'ఎక్స్' వేదికగా ఓ ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. "చరిత్రను నమోదు చేసే, జ్ఞాపకాలను భద్రపరిచే ఫొటోగ్రాఫర్లకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ రోజు మన మీడియా, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లను కలవడం గౌరవంగా భావిస్తున్నాను. వారి అంకితభావం, కళానైపుణ్యం, అవిశ్రాంత కృషి మనందరికీ కొత్త దృక్కోణాలను అందిస్తాయి.

## గ్రీన్ కార్డ్ ఆశావహులకు షాక్.. సెప్టెంబర్ 18 నుంచి కొత్త రూల్స్

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్న వారి ఆర్థిక స్థితి, వారు పొందిన ప్రభుత్వ ప్రయోజనాలపై అధికారులు విస్తృత స్థాయిలో దర్యాప్తు చేయనున్నారు. ఇది గ్రీన్ కార్డ్ ప్రక్రియను మరింత సంక్లిష్టంగా మార్చనుంది. యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) ఈ కొత్త మార్గదర్శకాలను ప్రకటించింది. దీని ప్రకారం.. దరఖాస్తుదారులు ప్రభుత్వ గృహ వసతి సహాయం (హౌసింగ్ అసిస్టెన్స్), ఫుడ్ స్టాంప్స్, కళాశాల విద్యకు ఆర్థిక సహాయం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందితే, వారి దరఖాస్తులను పరిశీలించేటప్పుడు అధికారులు ఆ అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. భవిష్యత్తులో వారు ప్రభుత్వానికి భారం (పబ్లిక్ ఛార్జ్) అయ్యే అవకాశం ఉందా? లేదా? అని అంచనా వేస్తారు. బైడెన్ ప్రభుత్వ హయాంలో 2022లో తీసుకొచ్చిన నిబంధనలను రద్దు చేస్తూ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఈ కొత్త తుది రూల్‌ను జులై 16న ప్రకటించింది. సెప్టెంబర్ 18 లేదా ఆ తర్వాత పోస్ట్‌మార్క్ చేయబడిన లేదా ఆన్‌లైన్‌లో సమర్పించిన గ్రీన్ కార్డ్ (ఫారం I485) దరఖాస్తులకు ఈ కొత్త, కఠినమైన నిబంధనలు వర్తిస్తాయి. అయితే, 2022 డిసెంబర్ 23 నుంచి 2026 సెప్టెంబర్ 17 మధ్య దరఖాస్తు చేసుకున్న వారికి పాత (2022) నిబంధనల ప్రకారమే గ్రీన్ కార్డ్ జారీ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ మార్పుల వల్ల కుటుంబ ఆధారిత (ఫ్యామిలీ బేస్డ్), ఉద్యోగ ఆధారిత (ఎంప్లాయ్‌మెంట్ బేస్డ్) కేటగిరీలలో గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకునే భారతీయులు ఎక్కువగా ప్రభావితం కానున్నారు. ఇప్పటికే గ్రీన్ కార్డ్ లేదా అమెరికా పౌరసత్వం ఉన్నవారికి ఈ నిబంధనలు వర్తించవు.

*** ఎవరిపై ప్రభావం?.. ఎవరికి మినహాయింపు?**

యూఎస్ పౌరుల జీవిత భాగస్వాములు, పిల్లలు, తల్లిదండ్రులు, అలాగే శాశ్వత నివాసితుల జీవిత భాగస్వాములు, పిల్లలు ఈ 'పబ్లిక్ ఛార్జ్' మదింపు పరిధిలోకి వస్తారు. వీరితో పాటు ప్రాధాన్యత కలిగిన ఉద్యోగులు, ఉన్నత డిగ్రీలున్న నిపుణులు, అసాధారణ ప్రతిభావంతులు, నైపుణ్యం కలిగిన కార్మికులు, పెట్టుబడిదారులు, మత కార్యకర్తలు వంటి ఉద్యోగ ఆధారిత కేటగిరీల వారు కూడా ఈ నిబంధనల కిందకు వస్తారు.అయితే, శరణార్థులు (రెఫ్యూజీలు), ఆశ్రయం కోరినవారు (అసైలీస్), మానవ అక్రమ రవాణా బాధితులు, వయొలెన్స్ ఎగైనెస్ట్ ఉమెన్ యాక్ట్ కింద స్వీయపిటిషనర్లు వంటి మానవతావాద, ప్రత్యేక వలస కేటగిరీలకు కాంగ్రెస్ మినహాయింపు ఇచ్చింది.

**అధికారులు ఏం పరిశీలిస్తారు?**

దరఖాస్తును పరిశీలించేటప్పుడు అధికారులు ఐదు ప్రధాన అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అవి: దరఖాస్తుదారుడి వయసు, ఆరోగ్యం, కుటుంబ పరిస్థితి, ఆస్తులుఆర్థిక స్థితి, విద్యనైపుణ్యాలు. వీటితో పాటు దరఖాస్తుదారుడికి మద్దతుగా స్పాన్సర్ ఇచ్చే అఫిడవిట్ ఆఫ్ సపోర్ట్ (ఫారం I864) పత్రాన్ని కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తారు.

# ప్రజావ్యతిరేక విధానాలతో వెళితే ప్రజలు బుద్ధి చెబుతారు

*** మాజీ రైతు బంధు అధ్యక్షులు కల్వకుంట్ల గోపాల్ రావు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ప్రజావ్యతిరేక విధానాలతో వెళితే ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని మాజీ రైతు బంధు అధ్యక్షులు కల్వకుంట్ల గోపాల్ రావు, బి ఆర్ ఎస్ పార్టీ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు బొంపల్లి సురేందర్ రావు పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని బీ ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, టీమ్స్ హాస్పిటల్ సందర్శన కొరకు పిలుపునిచ్చిన సందర్భంలో మాజీ మంత్రి హరీష్ రావును కోకాపేటలోని వారి నివాసంలో హౌస్ అరెస్ట్ చేయడాన్ని ముస్తాబాద్ మండలం భారత రాష్ట్ర సమితి పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. నర్సంపేటలో అర్ధరాత్రి పెద్దిరెడ్డి సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని తొలగించడాన్ని కూడా తీవ్రంగా ఖండిస్తున్నామని, అబద్ధం పునాదుల పైన వచ్చిన కాంగ్రెస్ పార్టీ వైఖరిని, విధానాలను ప్రజలు గమనించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, బీ ఆర్ ఎస్ పార్టీ ముస్తాబాద్ మాజీ పట్టణ అధ్యక్షులు రాచమడుగు సంతోష్ రావు, నాయకులు మెంగాని మనోహర్, ముస్తాబాద్ మండల యూత్ అధ్యక్షుడు శీలం స్వామి, నాయకులు కోడె శ్రీనివాస్, జాంగిర్, శివ కేశవ ఆలయ చైర్మన్ శేరయ్య, యూత్ నాయకుడు మీడిదొడ్డి యాదగిరి, పల్లె సత్యం గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పార్డీబీలో ఉచిత వైద్య శిబిరం

*** పార్డి (బి ) గ్రామ సర్పంచ్ మడి ప్రవీణ్**




ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా కుబీర్ మండలంలోని పార్డి(బి) గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో వైద్యులు ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. హెచ్ఐవి, రక్తపోటు, మధుమేహం, జ్వరం, మలేరియా, డెంగ్యూ తదితర పరీక్షలు నిర్వహించడంతో పాటు, అవసరమైన వారికి వైద్య సలహాలు, మందులు అందజేశారు. వివిధ వయస్సుల వారు శిబిరానికి హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గ్రామ సర్పంచ్ మడి ప్రవీణ్ , పాత్రికేయులు కొత్తూరు శంకర్, వైద్య సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పాత వీడియోతో కొత్త డ్రామా..!

*** ఎడిట్ చేసి కొత్త ఘటనగా ప్రచారం.. పోలీసులకు ఫిర్యాదు చేస్తా**

*** పోలుసాని లక్ష్మీనరసింహారావు**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : తనకు సంబంధించిన పాత వీడియోను ఎడిట్ చేసి నిన్నటి ఘటనగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావు ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. మార్చి 10న యూనివర్సిటీ క్రాస్ వద్ద కారు ప్రమాదం విషయంలో జరిగిన వివాదానికి సంబంధించిన వీడియోలోని కొంత భాగాన్ని మాత్రమే తీసుకుని ఇప్పుడు కొత్తగా జరిగినట్లు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ ఘటనపై అప్పుడే ఎఫ్ఐఆర్ నమోదైందని, కేసు కోర్టు పరిధిలో ఉందన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదని, తప్పుడు వీడియోల ప్రచారం కొనసాగితే పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే తమపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కటకం జనార్దన్, మోతె కరుణాకర్‌రెడ్డి, పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, సెగ్గెం సిద్దూ, మాడ హరీష్‌రెడ్డి, పిన్నింటి శ్రీనివాస్‌రావు, సింగణవేణి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుల మన్ననలు పొందాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను విక్రయించి వారి మన్ననలు పొందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన లక్ష్మణ్ ఎలక్ట్రానిక్ సేల్స్ అండ్ సర్వీస్ షాపును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వస్తువులను కొనుగోలు చేసే వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులతో పాటు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కొత్తగా ప్రారంభించిన లక్ష్మణ్ ఎలక్ట్రానిక్ సేల్స్ అండ్ సర్వీస్ షాప్ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అనంతుల కృపాకర్, శనగాని రాంబాబు, రాచకొండ శ్రీనివాస్, కమ్రుద్దీన్, వెంకన్న, చికూరి అశోక్, జగదీష్, సాయి, నిర్వాహకులు చికూరి లక్ష్మణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# కబ్జా భూములు స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలి

*** ఆక్రమణలపై క్షేత్రస్థాయి విచారణకు మంత్రి పొంగులేటి ఆదేశం**



పాలేరు, ప్రజా స్ఫూర్తి: ఖమ్మం రూరల్ పల్లెగూడెంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను అక్రమంగా ఆక్రమించిన వారి నుంచి వెంటనే స్వాధీనం చేసుకుని, గ్రామంలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి, ఆక్రమణలను గుర్తించి వెంటనే ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో రూ. 20లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి అర్హుడికీ సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందుకోసమే భూములను సమీకరించి ఇళ్ల స్థలాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

*** రూ.61.76 కోట్లతో ప్రగతి పరుగులు...**

పల్లెగూడెం సమగ్ర వికాసానికి రూ.61.76 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి ప్రకటించారు. గ్రామంలో ఇప్పటికే రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందని, గొల్లగూడెం నుంచి పల్లెగూడెం వరకు ఎన్ఎస్పీ కాల్వ గట్టుపై రూ.5.80 కోట్లతో మోడల్ సీసీ రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా, పల్లెగూడెం నుంచి మంగళగూడెం వరకు రూ.55 కోట్లతో చేపట్టే బీటీ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రూ.20 లక్షల వ్యయంతో పంచాయతీ కార్యాలయ భవనాన్ని కేవలం రెండు నెలల వ్యవధిలోనే నాణ్యతతో పూర్తి చేయడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను మంత్రి అభినందించారు. గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.12 లక్షలతో నూతన అంగన్‌వాడీ భవనాన్ని కూడా తక్షణమే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 31లోగా పింఛన్ల దరఖాస్తు అర్హులైన వయోవృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు , గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముధోల్ లో వ్యవసాయ రంగంలో వినూత్న ప్రయోగం



ప్రజాస్ఫూర్తి , భైంసా : నిర్మల్ జిల్లా ముధోల్ మండలం తరోడా గ్రామ శివారులో రైతు సాగుచేస్తున్న సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ కే. సుధాకర్ పరిశీలించారు. ఒకే వ్యవసాయ క్షేత్రంలో పంటల సాగుతో పాటు వివిధ అనుబంధ కార్యకలాపాలను సమన్వయం చేసుకుంటూ రైతు చేపడుతున్న విధానాన్ని ఆయన పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఇలాంటి సమీకృత వ్యవసాయ క్షేత్రాలు గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతుతో సమీకృత వ్యవసాయ విధానంలో ఎదురవుతున్న సమస్యలు, అందుతున్న ప్రయోజనాలు, వ్యవసాయ నిర్వహణపై అధికారులు చర్చించారు. రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయంలో స్థిరత్వం సాధించేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, డీఎల్పీవో బట్టేకర్ లక్ష్మణ్, ఎంపీడీవో లవకుమార్, గ్రామపంచాయతీ సర్పంచ్ ఆరిఫుద్దీన్, ఏపీవో శిరీషారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలి

*** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**




జనగామ, ప్రజాస్ఫూర్తి : మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంచడంతో పాటు ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించేందుకు పక్కా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపాలిటీ పనితీరుపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పన్నుల వసూళ్లు, పారిశుద్ధ్యం, ఇంటి నిర్మాణ అనుమతులు, ట్రేడ్ లైసెన్సులు, జనన-మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీకి ఉన్న ఆదాయ వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంతో పాటు కొత్త ఆదాయ మార్గాలను అన్వేషించాలని కలెక్టర్ సూచించారు. ఇంటి పన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్సుల బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి మున్సిపాలిటీని ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. పట్టణ పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వార్డుల వారీగా పారిశుద్ధ్య రూట్ మ్యాప్ రూపొందించి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జనాభా, ఇళ్ల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని కేటాయించి వారి పనితీరును పర్యవేక్షించాలన్నారు. స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లను వార్డుల వారీగా రూట్లకు కేటాయించి చెత్త సేకరణలో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. రోడ్లపై చెత్త వేసే వారి పై నిబంధనల ప్రకారం చర్యలు తీసు కోవాలని స్పష్టం చేశారు. మున్సిపల్ సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని , వార్డుల వారీగా చేపడుతున్న కార్యకలాపాలను మ్యాపింగ్ చేసి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంటి నిర్మాణ అనుమతులను నిర్ణీత గడువులోగా జారీ చేయాలని, అనుమతి లేని నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించరాదన్నారు. జనన-మరణ ధ్రువీకరణ పత్రాలు, ట్రేడ్ లైసెన్సులు తదితర పౌర సేవలను నిర్ణీత సమయంలో అందించాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రకటనలపై అడ్వర్టైజ్‌మెంట్ చార్జీలను నిబంధనల మేరకు పునః సమీక్షించాలని, టెండర్లు, రీటెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీకి సంబంధించిన పూర్తి సమాచారాన్ని విభాగాల వారీగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచి పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రజలు పన్నులన్నింటినీ సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కడకంచి బాలమణి, కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, మేనేజర్ ప్రభాకర్, డీఈ రాజ్‌కుమార్, వార్డు అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణలో ఆటోల బంద్.. నిరవధిక సమ్మె




జనగామ, ప్రజాస్ఫూర్తి : ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలో ఆటోల బంద్, నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద పట్టణ అధ్యక్షుడు బాల్దే శ్రీశైలం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జేరుపోతుల కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై సమ్మెకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, మృతిచెందిన డ్రైవర్ల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు హెల్త్ కార్డులు, ఆటో నగర్‌లు ఏర్పాటు చేయడంతో పాటు సంవత్సరానికి రూ.12 వేల మెయింటెనెన్స్ సాయం అందించాలని కోరారు. ఓలా, ఉబర్, రాపిడో వంటి ప్రైవేట్ యాప్ లను రద్దు చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలో సేవలు నిర్వహించాలని, ఆటో డ్రైవర్ల రూ.5 లక్షల ప్రమాద బీమాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, ఆర్టీసీ ఈవీ ఆటోల విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. ఆటో డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు తెలంగాణలో ఆటోల బంద్, నిరవధిక సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి బూడిద ప్రశాంత్, నోముల శ్రీను, గనిపాక రవి, మంగ శీను, అబ్బాస్, ఎండీ మైమూద్, జన్నె మహేష్, గాదరి కృష్ణ, బర్ల నరసింహ, చింతకింది అమర్, మజ్జిగ నరసింహ, కొల్లూరి ఎల్లయ్య, గంగాపురం ఆంజనేయులు, ఎం.సత్యం, కె.బాల్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# షాద్నగర్ సబ్ రిజిస్టర్ శేషగిరి చాంద్ కు ఘనంగా వీడ్కోలు

ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : షాద్నగర్ సబ్ రిజిస్టర్ ఆఫీసర్ శేషగిరి చాంద్ కు షాద్నగర్ నుండి ప్రమోషన్ గ్రేడ్ వన్ సబ్ రిజిస్టర్ గా నారపల్లికి బదిలీ చేయడమైనది. ఈ సందర్భంగా శేషగిరి చాంద్ ను ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏటీఎంలో చోరీ

*** నిందితుల కోసం పోలీసులు ముమ్మర గాలింపు**




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంబోజిపల్లిలో ఎస్బీఐ ఏటీఎంలో బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో ఏటీఎం ను ధ్వంసం చేసి రూ.14 లక్షల 500 నగదును అపహరించినట్లు సమాచారం. చోరీకి సంబంధించిన దృశ్యాలు ఏటీఎంలోని సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ కృష్ణమూర్తి, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీంను రప్పించి సంఘటనా స్థలంలో ఆధారాలను సేకరిస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ నిందితుల ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. ఘటన నేపథ్యంలో జిల్లాలోని ఏటీఎంల వద్ద పోలీసు బందోబస్తును అప్రమత్తం చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# పాలిటెక్నిక్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

*** ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్**




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ప్రైవేటీకరణ ను చేసేందుకు తీసుకువచ్చిన జీవో నెంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మెదక్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రాందాస్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శక్తి పాలసీ తీసుకుని వచ్చి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు అన్యాయం చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాల గడుస్తున్నా రాష్ట్రానికి విద్య శాఖ మంత్రి లేకపోవడం బాధాకరమన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ఉన్నటువంటి కోర్సులను ఎత్తివేసి టాటా కంపెనీ కి 4000 కోట్లకు ఒప్పందం కుదుర్చుకొని విద్యార్థులకు తీరని అన్యాయాన్ని కలిగిస్తుదని అన్నారు. పాలిటెక్నిక్ కళాశాలను ప్రైవేటీకరణ చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని వాడు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కార్యదర్శి సంతోష్, శ్రీవిద్య సోని తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ సూర్యభగవానుడి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



మల్కాజిగిరి , ప్రజాస్ఫూర్తి: నేరేడ్‌మెట్‌లోని శ్రీ అన్నపూర్ణ సహిత శ్రీ కాశీ విశ్వనాథ స్వామి ఆలయంలో శ్రీ సూర్యభగవానుడి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో, వేదమంత్రోచ్చారణల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. పుష్పగిరి పీఠాధీశ్వరులు శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతి స్వామివారి కరకమలముల మీదుగా సూర్యభగవానుడి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో శివపార్వతులకు ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పీఠాధీశ్వరులు భక్తులకు దివ్య ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు సూర్యభగవానుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

*** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

ప్రజాస్ఫూర్తి, భైంసా: జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని ఓటర్ల గుర్తింపు, ఓటర్ల వివరాల్లోని వ్యత్యాసాలు, అనామలీస్ పరిశీలనను నిర్దేశిత నిబంధనల మేరకు పూర్తి చేయాలని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ఎస్ఐఆర్ ప్రక్రియపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లాల వారీగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించి, అధికారులకు పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షిస్తూ, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచనల మేరకు జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత కార్యాచరణ ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల వివరాల పరిశీలనలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐఆర్‌లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను సమగ్రంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. ఫారం 6, ఫారం 7, ఫారం 8 ద్వారా అందే దరఖాస్తులను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా




చూడడంతో పాటు, అనర్హులైన పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు, శిక్షణ అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. సిబ్బందికి ఎదురయ్యే సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ, ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఎస్ఐఆర్ కింద చేపట్టాల్సిన కార్యక్రమాలకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి దశకు సంబంధించిన లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డీఆర్వో రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, సంబంధిత అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల నుండి డబ్బులు తీసుకున్న ఉద్యోగి సస్పెండ్

ప్రజాస్ఫూర్తి,నల్లగొండ: ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో లబ్దిదారు నుండి




డబ్బులు తీసుకున్నట్లు విజిలెన్స్ విచారణలో రుజువైనందున నల్గొండ జిల్లా, తిరుమలగిరి సాగర్ మండల గృహ నిర్మాణ శాఖ ఔట్సోర్సింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ బుక్యా గోపిని వెంటనే ఉద్యోగం నుండి తొలగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏ ఈ బుక్యా గోపి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేందుకు డబ్బులు తీసుకుంటున్నారని లబ్ధిదారులు రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ కు ఫిర్యాదు చేయగా, ఈ ఫిర్యాదు పై స్పందించిన రాష్ట్ర గృహ నిర్మాణ కార్పొరేషన్ ఈ విషయంపై విజిలెన్స్ విచారణ చేపట్టింది. విజిలెన్స్ విచారణలో ఏ ఈ డబ్బులు తీసుకున్న విషయం నిజమని తేలడంతో,విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరులో అక్రమాలకు పాల్పడినందుకు గాను భూక్య గోపిని తక్షణమే ఉద్యోగం నుండి తొలగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎవరు అక్రమాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ఫిర్యాదులను లబ్ధిదారులు తనకు గాని, లేదా టోల్ ఫ్రీ నెంబర్ 18004251442, 18005995991 లకు ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



లింగాలఘణపురం/జనగామ, ప్రజా స్ఫూర్తి: ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవా న్ని పురస్కరించుకుని లింగాలఘణపు రం మండల కేంద్రంలో ఫోటోగ్రఫీ అసో సియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వ హించారు. ఈ సందర్భంగా టీజీపీవిఏ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఫోటో గ్రఫీ రంగం అభివృద్ధికి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకు న్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షు లు రామచందర్, జిల్లా ముఖ్య సలహా దారు చిరుమల్ల శ్రీనివాస్, మండల అ ధ్యక్షులు అనిల్, ఉపాధ్యక్షులు ఉప్పల య్య, ప్రధాన కార్యదర్శి ఉపేందర్, కోశా ధికారి భాస్కర్, కుటుంబ భరోసా కన్వీ నర్ విజయ్ కుమార్‌తో పాటు సీనియ ర్ ఫోటోగ్రాఫర్లు అనిల్, ప్రభాకర్,లక్ష్మణ్,వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిపై సమన్వయ సమావేశం



లింగాలఘణపురం, జనగామ, ప్రజా స్ఫూర్తి : మండల గ్రామాల అభివృద్ధి పై సమన్వయ సమావేశం బుధవారం లిం గాలఘణపురం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మండల ప్రత్యేకాధికా రి, ఆర్డీఓ కె.గోపిరాం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ డి.వెంకటరమణ, మండల ప్రజా పరిష త్ అభివృద్ధి అధికారి కె.శివశంకర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి సీహెచ్.సుమన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో అమలవుతున్న వివిధ ప్రభుత్వ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరు పై అధికా రులు సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా అభివృద్ధి పనుల పురోగతి, ప్ర భుత్వ ప థకాలను ప్రజలకు చేరువ చే యడం తదితర అంశాలపై చర్చించారు. . సమావేశంలో మండల స్థాయి లోని వివిధ శాఖల అధికారులు, మండలం లోని అన్ని గ్రామాల సర్పంచులు, పం చాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్నిపురస్కరించుకుని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఫోటోగ్రాఫర్స్ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో సంఘం అధ్యక్షుడు బండ రఘోత్తం రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బుర్ర కొమురయ్య గౌడ్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్, కౌన్సిలర్ కురిమిల్ల శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగెర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ ప్రాధాన్యతను వివరిస్తూ.. ఫోటో కేవలం చిత్రం కాదని, గతాన్ని కళ్లముందు సజీవంగా నిలిపే జ్ఞాపకమని పేర్కొన్నారు. సమాజానికి ఫోటోగ్రాఫర్లు అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కనుకుల శివ, కోశాధికారి ఎల్దండి రాకేష్, సలహాదారు దాసారపు సదానందం, మాజీ ప్రధాన కార్యదర్శి నేరెళ్ల శ్రీనివాస్‌తో పాటు వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, సంఘం ప్రతినిధులు, ఫోటోగ్రాఫర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై షీ టీం అవగాహన

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగం, మహిళల భద్రతపై భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సంఘ మిత్ర డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో షీ టీం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు షీ టీం ఎస్సై స్వప్నకుమారి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థులకు సైబర్ మోసాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అపరిచితుల ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, వీడియో కాల్స్‌కు స్పందించవద్దని, వ్యక్తిగత వివరాలు, పాస్‌వర్డ్లు, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని సూచించారు. సోషల్ మీడియాలో తెలియని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులు, అనుమానాస్పద లింకులు, మెసేజ్‌లకు దూరంగా ఉండాలని



తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మహిళలపై వేధింపులు, అసభ్య ప్రవర్తనకు సంబంధించి షీ టీం 8712658162 నంబర్‌కు సమాచారం ఇవ్వవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అవసరమైతే నేరస్తులకు కౌన్సెలింగ్‌తో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు డయల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహాగాం గ్రామం లో గోదాముల నిర్మాణానికి పది ఎకరాల స్థలం కేటాయింపు

*** వెల్లడించిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**

ప్రజాస్ఫూర్తి, భైంసా : రైతులు పండించిన ధాన్యం విలువలకు ఇబ్బందులు కలగకుండా భైంసా మండలంలోని మహగాం గ్రామంలో గోదాముల నిర్మాణానికి ప్రభుత్వం పది ఎకరాల స్థలం కేటాయించడం జరిగిందని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ వెల్లడించారు. బుధవారం హైదరాబాదులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రొసీడింగ్ ను (జిల్లా కలెక్టర్ ఉత్తర్వు కాపీని) అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విఠలేశ్వర ఆలయం వెనుక ఉన్న 218 సర్వే నంబర్ లో 10 ఎకరాల



ప్రభుత్వ భూమిని గుర్తించడం జరిగిందని, ఈ భూమిని తెలంగాణ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ కు గోదాముల నిర్మాణం కోసం కేటాయిస్తూ ప్రతిపాదించడం జరిగిందన్నారు.. 10 ఎకరాల స్థలంలో పదివేల నుంచి 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న సైంటిఫిక్ గోడౌన్స్ నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. స్థలము అప్పగించిన తర్వాత నిర్మాణం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా మహాగాం సర్పంచ్ అప్పల రాజ్యలక్ష్మి రాకేష్ మాట్లాడుతూ తమ గ్రామంలో గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ కు కృతజ్ఞతలు చెప్పారు. ప్రభుత్వం వేగవంతంగా గోదాముల నిర్మాణ ప్రక్రియ ప్రారంభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## ఎస్ఆర్ఎస్పీ కాలువల నుంచి సాగునీరు అందించాలి

*** సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్..**

కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: ప్రస్తుతం వాతావరణ మార్పులు వల్ల వర్షాలు సమృద్ధిగా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ఎస్. ఆర్ .ఎస్ .పి. కాలువల ద్వారా మండలంలోని పాలేరు జలాశయానికి నీటిని తరలించి సాగర్ ఆయకట్టు పంటలను, మండలానికి నీటిని అందించి మండల వ్యాప్తంగా రైతుల పంటలను కాపాడాలని, పాలేరు నియోజకవర్గ శాసనసభ్యులు, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవ చూపాలని సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పద్మా రెడ్డి భవనంలో యడవల్లి రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన సిపిఎం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితులలో రైతులు ఇప్పటికే వరి, పత్తి, తదితర పంటలు




సాగు చేశారని, ఈ పంటలను కాపాడుకోవడానికి నాగార్జున సాగర్ లో నీటి లభ్యత లేనందున, ప్రత్యామ్నాయంగా ఎస్సారెస్పీ కాలువల ద్వారా మండలానికి నీటిని తరలించి, పాలేరు జలాశయాన్ని, మండలంలోని చెరువులు, కుంటలను నింపి, పంటలను కాపాడాలి, భూగర్భ జలాలను పెంచాలని, పంటలను కాపాడవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. గత సంవత్సరం వరి 24,569 ఎకరాలు సాగు చేయగా.. ప్రస్తుతం 17,561 ఎకరాలు మాత్రమే సాగు చేశారని, గత సంవత్సరం పత్తి 13,000 సాగు చేయగా.. ప్రస్తుతం 11020 ఎకరాలుగా సాగు చేశారని, వీటితోపాటు మండల వ్యాప్తంగా మిర్చితోపాటు, కొంత వాణిజ్య పంటలు వేశారని ఈ పంటలను కాపాడుకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని, ఎస్సారెస్పీలో నీటి లభ్యత ఉన్నందున తక్షణమే ఎస్ఆర్ఎస్పీ కాలువల ద్వారా నీటిని మండలానికి అందించి రైతుల పంటను కాపాడాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు శీలం గురుమూర్తి, బిక్కసాని గంగాధర్, కర్ణబాబు,గన్య నాయక్, మండల కమిటీ సభ్యులు, గ్రామశాఖ కార్యదర్శులు, పార్టీ సీనియర్ నాయకులు, సీనియర్ సభ్యులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మోహన్‌రావు పాటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్

ప్రజాస్ఫూర్తి,భైంసా: నిర్మల్ జిల్లా భైంసా పట్టణానికి చెందిన నిమ్మల్వార్ భూలక్ష్మి, ఇటీవల మృతి చేందడం జరిగింది. విషయం తెలుసుకున్న మోహన్ రావు పటేల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్ వారి నివాసానికి వెళ్లి, కుటుంభ సభ్యులయినా నిమ్మల్వార్ నాగనాథ్, నిమ్మల్వార్ సాయినాథ్, నిమ్మల్వార్ రాజేశ్వర్,మరియు వారి కుటుంభ సభ్యులను పరామర్శించి, మృతికి గల



కారణాలను అడిగి తెలుసుకొని బాధిత కుటుంబానికి ధైర్యంగా ఉండాలని వారికి మనోధైర్యం కల్పిస్తూ ప్రగాఢ సానుభూతిని తెలియచేసారు. ఆయన అనంతరం మాట్లాడుతూ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ముందస్తు అరెస్ట్



జనగామ, ప్రజాస్ఫూర్తి : బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నర్సంపేటలో నిర్వహించనున్న పత్రిక సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్తున్న మాజీ మం త్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ను జనగా మ పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్ కు తరలించారు. నర్సంపే టలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేప థ్యంలో అక్కడికి వెళ్లవద్దని, ఉన్నతాధి కారుల సూచనల మేరకే అరెస్ట్ చేస్తున్న ట్లు సీఐ సత్యనారాయణ రెడ్డి ఎర్రబెల్లి దయాకర్ రావుకు తెలిపారు. అరెస్టను నిరసిస్తూ కొద్దిసేపు పోలీస్‌స్టేషన్ ఎదు ట బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చే పట్టారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయా కర్ రావు మీడియాతో మాట్లాడుతూ రెవెన్యూ అధికారుల అండదండల తో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగు లేటి శ్రీనివాస్ రెడ్డి భూముల దందాకు తెరతీశారని ఆరోపించారు. రానున్న రోజుల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, అప్పుడు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఇబ్బందులు తప్పవని ఆ యన హెచ్చరించారు. అనంతరం ఎర్ర బెల్లి దయాకర్ రావును పోలీస్ ఎస్కార్ట్ తో హైదరాబాద్‌కు తరలించారు.

## రాసమల్ల పుణ్య దంపతుల మరణం

*** వెల్ది గ్రామంలో శోకసముద్రం**

ప్రజాస్ఫూర్తి, సూర్యపేట : రఘునాథ్ పల్లి మండలంలోని వెల్ది గ్రామం మాజీ సర్పంచ్ రాస మల్ల యాదగిరి కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు తల్లి మరణించిన 24 గంటల్లోనే వారి తండ్రి ఏకకాలంలో మరణించారు. ఆ వృద్ధ దంపతులు ప్రేమకు ప్రతిరూపం అనుకోవచ్చు కానీ వారి కుటుంబానికి తీరని లోటుగా బాధాకరంగా మిగిల్చిపోవడం వారి కుటుంబానికి కాక గ్రామంలో కూడా వారి అన్యత భావానికి చిహ్నంగా బాధలో శోకసముద్రమైది.



## యల్లావుల వెంకటయ్య మృతికి ఘన నివాళులు



గరిడేపల్లి , ప్రజాస్ఫూర్తి: గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామపంచాయతీ 11వ వార్డు మెంబర్ బడేటి పద్మ లింగయ్య తండ్రి యల్లావుల వెంకటయ్య ఈరోజు తెల్లవారుజామున తుది శ్వాస విడిచిన విషయం తెలిసి మేము తీవ్ర దిగ్భ్రాంతికి, విచారానికి గురయ్యాము. మా తోటి వార్డు మెంబర్ బడేటి పద్మ లింగయ్య కుటుంబంలో జరిగిన ఈ విషాద సమయంలో వారికి మరియు వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము. ఈ కష్ట సమయంలో వారికి అండగా ఉంటూ, మనోధైర్యాన్ని కల్పించాలని కోరుకుంటున్నాము. యల్లావుల వెంకటయ్య పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గరిడేపల్లి మండల కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షులు ఎస్కే చాందుమియా, ఉప సర్పంచ్ చిత్తలూరి వీరస్వామి, వార్డు మెంబర్లు బండారు సైదులు, ముత్తినేని హరిబాబు, మొగిలి సైదులు, గూడెపు వెంకటేశ్వర్లు, బండారు అంజయ్య, దొంతగాని తార భూతం సరిత, గుండు అజయ్, దాసరి భవాని గోపి , ఎస్కే సఫియా మీరా పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకులు , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యుల ఒకరోజు రిలే నిరాహార దీక్ష విజయవంతం




ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట ప్రజల చిరకాల స్వప్నం కోసం పోరాడుతున్న బుల్లెట్ ట్రైన్ సాధన సమితి చేపట్టే ఏ కార్యక్రమానికైనా తమ పూర్తి మద్దతు ఉంటుందని ఆర్యవైశ్య సంఘ నాయకులు ప్రకటించారు. బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో ఆరవ రోజు సూర్యాపేట ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రానికి రైల్వే మార్గం వస్తే ఈ ప్రాంతమంతా పారిశ్రామికంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్ర మంత్రులు కలుగజేసుకొని కేంద్ర రైల్వే శాఖ మంత్రితో మాట్లాడి జాతీయ రహదారి 65కు సమాంతరంగా బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేయడంతో పాటు సూర్యాపేటకు రైల్వే కారిడార్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్న నిరాహార దీక్షకు సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి రాజా, వై.వెంకటేశ్వర్లు, ఉప్పల ఆనంద్, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, ప్రముఖ పారిశ్రామికవేత్త మీలా మహదేవ్, కౌన్సిలర్ డాక్టర్ రామ్మూర్తి, జీడి భిక్షం, దర్మార్జున్, సలిగంటి వీరేంద్ర సంఘీభావం తెలిపారు. సాయంత్రం అఖిలపక్ష నాయకులు దీక్షలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘ నాయకులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ రిలే నిరాహార దీక్షలో ఆర్యవైశ్య సంఘ నాయకులు బండారు రాజా, కర్నాటి కిషన్,పోతుగంటి వెంకటేశ్వర్లు, తోట శ్యాంప్రసాద్,కలకోట లక్ష్మయ్య, వెంపటి శభరినాద్, వెంపటి పురుషోత్తం ,బొమ్మిడి లక్ష్మినారాయణ,,వెంపటి సురేష్ ,తప్పి గాంధీ,ఈగ దయాకర్, గుండా రమేష్ ,ఈగ వెంకటేశ్వర్లు, బజ్జూరి శ్రీనివాస్, నరేందర్, వప్పలంచు కృష్ణ,షీలా శంకర్,చల్లా సత్యనారాయణ, కర్నాటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ లో ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండల ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించారు. అనంతరం చౌటుప్పల్ ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సుక్క స్వామి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కాటం రాజు, జిల్లా సలహాదారుడు విశ్వనాథ్ చంద్రశేఖర్, జిల్లా గౌరవ సలహాదారుడు రవీందర్, చౌటుప్పల్ మాజీ అధ్యక్షుడు తొర్పునూరి సాయిలు గౌడ్, సీనియర్ ఫోటోగ్రాఫర్లు చింతల గణేష్, కందగట్ల కృష్ణ, మెట్టు రామచంద్రారెడ్డి, జక్క చలమందరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వనం ఋషి, కోశాధికారి రోషనగారి రాఘవేంద్ర గౌడ్, ఉపాధ్యక్షులు ఎర్ర శివ, వరికుప్పల మహేష్, పల్లెర్ల సుజిక్, ప్రచార కార్యదర్శి పగడాల శంకర్, కార్యవర్గ సభ్యులు మలిగె రవి, పగిళ్ల మహేష్, డాకోజి నాని, జాజుల రామకృష్ణ, పెడకంటి నాగేందర్, సంతోష్, ప్రవీణ్, రమేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

**: కలెక్టర్ కె.హరిత**




కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: గిరిజన విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో బుధవారం నిర్వహించిన నిర్వహణ కమిటీ సమావేశానికి ఆమె హాజరై పాఠశాలలో విద్యాబోధన, మౌలిక వసతులు, విద్యార్థుల ఆరోగ్యం, ఆహారం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ, మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో అర్థమయ్యే రీతిలో బోధన అందించి, ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా చూడాలని సూచించారు. తరచూ గైర్హాజరవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి కారణాలను తెలుసుకోవాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో నాణ్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, పాఠశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, నిర్వహణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వెలిదండలో దోమల మందు పిచికారీ

*** సర్పంచ్ చెన్నగాని సాంబయ్య**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామంలో వానాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామ సర్పంచ్ చెన్నగాని సాంబయ్య ఆధ్వర్యంలో గ్రామంలోని పలు ప్రాంతాల్లో దోమల మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉన్నందున గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నాగేంద్రబాబు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ వో సి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే కుంభం



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వలిగొండ మండలం నాతాళ్ళగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మస్కు బుచ్చయ్య కుటుంబానికి బుధవారం భువనగిరి ఎమ్మెల్యేకు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఎల్ వో సి చెక్కును అందజేశారు బుచ్చయ్య కుమారుడు ఇటీవలనిమ్స్ హాస్పిటల్ హైద్రాబాద్ లో సర్జరీ చేయించుకున్నాడు దీంతో ప్రభుత్వం ద్వారా మంజూరైన ఎల్ ఓ సి చెక్కు రెండు లక్షల 50 వేలుఅనిల్ కుమార్ రెడ్డి అందజేశారు, బుచ్చయ్య కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకుధన్యావాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉలిపే మల్లేశం , మాజీ ఎంపీటీసీ ఉద్దగిరీ భాస్కర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మస్కు నరసింహ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉద్దగిరి శంకరయ్య, కాంగ్రెస్ నాయకులు కాసుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు

# సాగర్ నీటి విడుదలపై ప్రభుత్వం ప్రకటన చేయాలి



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండల భారతీయ జనతా పార్టీ గరిడేపల్లి మండల తాసిల్దార్ కి వర్షా బావ పరిస్థితులలో సాగర్ ఎడమ కాలువ పరిధిలోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు .ప్రభుత్వం స్పందించక పోవటం సరికాదు. నాగార్జునసాగర్ లో 160 టీఎంసీ ల నీరు ఉన్నప్పటికీ సాగర్ ఎడమ కాలువకు 70 శాతం వరి నాట్లు చెరువుల కింద బావుల కింద , బోర్ల కింద, నాట్లు పూర్తి చేసి ఉన్నారు. కానీ నాగార్జునసాగర్ ఎడమ కాలవ కింద 70% నాట్లు వేసి ఉన్న రైతులను 30 టీఎంసీ ల నీరు నీ సెప్టెంబర్ అక్టోబర్ నవంబర్ నెలలో విడతలవారీగా ప్రతినెల 10 టీఎంసీ నీరు ఇచ్చి ఇప్పుడు నాట్లు పూర్తి చేసుకున్న రైతులని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆదుకోవాలని స్థానిక గరిడేపల్లి మండల తాసిల్దార్ కి వినతి పత్రం అందించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటిని విడుదల చేయాలని, చెయ్యని పక్షంలో పెద్ద ఎత్తున భారతీయ జనతా పార్టీ , రైతుల తోటి రాస్తా రోకులు ధర్నాలు ఉధృతం చేసి ప్రభుత్వాన్ని అసెంబ్లీ ముట్టడి చేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ,జిల్లా ఉపాధ్యక్షులు ఆకుల బిక్షమయ్య గౌడ్ సీనియర్ నాయకులు రామినేని బిక్షమయ్య పోలిశెట్టి అంజయ్య జిల్లా నాయకులు చిత్తలూరు సోమయ్య, జనిగల శ్రీనివాస్ , మండల ప్రధాన కార్యదర్శి కాంపాటి రాజు, మండల ఉపాధ్యక్షులు నర్సింగ్ నాగ సైదులు, మండల నాయకులు రావుల ఆంజనేయులు తదితరుల పాల్గొన్నారు

# గర్భిణులు, శిశువుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

*** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**




ప్రజాస్ఫూర్తి, భైంసా : జిల్లాలో గర్భిణులు, బాలింతలు, శిశువుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, వైద్యారోగ్య శాఖ 'అంకురం ' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భం దాల్చిన నుంచి ప్రసవం అయ్యే వరకు తప్పనిసరిగా పర్యవేక్షణ ఉంచాలన్నారు. గర్భిణుల్లో ఆరోగ్య సమస్యలు ఉంటే వారిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచి, వారిని సంరక్షించాలన్నారు. ఎన్ఎంఆర్ సంఖ్యను సింగిల్ డిజిట్ కి పరిమితం చేయడమే అంకురం కార్యక్రమం లక్ష్యమని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రణాళికల ద్వారా గర్భిణులు, బాలింతలు, శిశువుల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు గర్భిణులకు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారిగా వైద్యాధికారులు గర్భిణులు తప్పనిసరిగా సంబంధిత చికిత్సలు తీసుకునేలా పర్యవేక్షణ ఉంచాలని అన్నారు.సంకల్ప్ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టి, నవజాత శిశువుల మరణాలు గత సంవత్సరంతో 50 శాతం తగ్గించాలన్నారు.అనంతరం కార్యక్రమానికి సంబంధించిన గోడ ప్రతులను కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్,ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్యులు, వైద్యాధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలి

*** మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి భారత రాష్ట్ర సమితి బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశం బుధవారం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి కరీంనగర్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రతులను బూత్ స్థాయి ఏజెంట్లకు అందజేశారు. ప్రతి బూత్ పరిధిలోని జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఓటరు పేరు ఉండేలా చూడాలని సూచించారు. మరణించిన ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారి పేర్లు, ఒకే వ్యక్తి పేరు రెండుచోట్ల నమోదైందా, పేర్లు, చిరునామాల్లో తప్పులున్నాయా అనే అంశాలను పరిశీలించాలని తెలిపారు. ముసాయిదా జాబితాపై ఆగస్టు 18 నుంచి 25 వరకు అభ్యంతరాలు, సవరణలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కొత్త ఓటరు నమోదుకు 6వ నంబరు దరఖాస్తు, పేరు తొలగింపునకు 7వ నంబరు దరఖాస్తు, ఓటరు వివరాల సవరణకు 8వ నంబరు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో బూత్ ఏజెంట్ల పాత్ర కీలకమన్నారు. అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షించేలా పనిచేయాలని సూచించారు.

# దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది

*** ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: దివ్యాంగుల సంక్షేమానికి, వారి ఆర్థిక, సామాజిక వికాసానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వం తరఫున వంద శాతం సబ్సిడీపై సమకూర్చిన త్రీ వీలర్ (ట్రై మోటార్) సైకిళ్ళను బుధవారం కూసుమంచి క్యాంపు కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా, తమ స్వశక్తితో జీవించేందుకు అవసరమైన సహాయ ఉపకరణాలను ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. రవాణా సౌకర్యం సులభతరం కావడానికి ఈ ట్రై మోటార్ సైకిళ్లు ఎంతో తోడ్పడతాయని అన్నారు. దివ్యాంగత్వాన్ని వైకల్యంగా భావించకుండా, బలమైన ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. సరైన పట్టుదల ఉంటే జీవితంలో సాధించలేనిది ఏదీ లేదని, దివ్యాంగులు సమాజంలో స్వయం సమృద్ధి సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి ఆకాంక్షించారు. రాష్ట్రంలో అర్హత ఉన్న ప్రతి దివ్యాంగునికి ప్రభుత్వ పథకాలు, పింఛన్లు, ఇతర సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, దివ్యాంగ లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్పీలో పలువురు నాయకుల చేరిక



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో పలువురు నాయకులు, కార్యకర్తలు చేరారు. భూపాలపల్లి టౌన్ ఎల్బీనగర్‌కు చెందిన ఆర్ఎంపీ డాక్టర్ కుమారస్వామి, నందిగామకు చెందిన ప్రభాకర్ గౌడ్‌తో పాటు పలువురు పార్టీలో చేరారు.ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ, జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా టీఆర్పీ పనిచేస్తోందని నూతనంగా చేరిన నాయకులు తెలిపారు. తీన్మార్ మల్లన్న చేస్తున్న పోరాటం, ఆయన ఆశయాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామని పేర్కొన్నారు. పటేల్ వనజ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య, రాజ్యాంగబద్ధ పద్ధతిలో బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం సాధించేందుకు పార్టీ కృషి చేస్తోందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పార్టీలో చేరి తీన్మార్ మల్లన్న పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మాట్లాడుతూ నూతనంగా చేరిన వారికి స్వాగతం పలుకుతూ, పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రణీత్, సంతోష్, శ్రీకాంత్, రాంబాబు తదితరులతో పాటు టీఆర్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెండింగ్లో ఉన్న స్కాలర్ షిప్లను ఫీజు రియంబర్స్మెంట్లను వెంటనే విడుదల చేయాలి

**బీజేవైఎం డిమాండ్..**




ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్ : పెండింగ్లో ఉన్న స్కాలర్ షిప్లను ఫీజు రియంబర్స్మెంట్లను వెంటనే విడుదల చేయాలని బుధవారం షాద్ నగర్ పట్టణ ముఖ్య కూడలి లో బీజేవైఎం ఆధ్వర్యంలో భారీ ధర్నాకు దిగారు. ధర్నాలో పాల్గొన్న బీజేవైఎం నాయకులు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ లతో పాటు, ఫీజు రీ అంబర్స్ మెంట్ బకాయిలు 1500 కోట్లు వెంటనే విడుదల చేయాలనీ డిమాండ్ చేసారు. ప్రభుత్వం చేస్తున్న ఆలస్యం వల్ల తెలంగాణ లోని 40 లక్షల మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారాన్నారు. వెంటనే నిధులు విడుదల చేయకపోతే బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళనలు మరింత తీవ్రం చేస్తామన్నారు. ఈ ధర్నాలో ప్రైవేట్ కళాశాల ల విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# జీవో నెంబర్ 33 తక్షణమే రద్దు చేయాలి

*** టీ డబ్ల్యు యం ఎఫ్ జిల్లా బాధ్యులు గుండా ఉపేందర్ రెడ్డి**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: ఇందిరమ్మ ఇళ్ల కమిటీలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 33 ను తక్షణమే రద్దు చేయాలని టీ డబ్ల్యూ ఎం ఎఫ్ జిల్లా బాధ్యులు గుండ ఉపేందర్ రెడ్డి కోరారు. బుధవారం కూసుమంచి మండలం క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి మండలం టీ డబ్ల్యు యం ఎఫ్ ఇంచార్జ్ కర్ల రామారావు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. జి ఓ నంబర్ 33 వలన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల కు ఇందిరమ్మ ఇళ్లు కమిటీ లో ఎటువంటి భాగస్వామ్యం లేదని , తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ఆ జీవో 33 రద్దు చేసి వార్డు సభ్యులకు ఇందిరమ్మ ఇళ్లు కమిటీ లో ప్రాధాన్యత కల్పించి న్యాయం చేయాలని కోరినట్లు వివరించారు. వినతి పత్రం అందించిన వారిలో కట్ట అప్పారావు, చెరుకుపల్లి వీరయ్య, మంద నవ్య చంద్రశేఖర్ గౌడ్, ఐతగాని నవీన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు

## ప్రకృతి ప్రేమికుడును ఘనంగా సన్మానించిన సేవా ట్రస్ట్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సేవా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో బుధవారం మానవత్వ దినోత్సవం సందర్భంగా హరిత మిత్ర అవార్డు గ్రహీత ప్రకృతి ప్రేమికుడు దైద వెంకన్న ను ట్రస్ట్ సభ్యులు,మహిళలు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సన్మాన గ్రహీత వెంకన్న మాట్లాడుతూ రాబోయే భావితరాల కోసం నా జీవితం అంకితం చేసి కొన్న లక్షల మొక్కల నాటనని అన్నారు.ఈ యొక్క సన్మానం ఇంక నా భాద్యత ను పెంచిందని నన్ను సన్మానించిన ట్రస్ట్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యాక్రమంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సేవా ట్రస్ట్ ప్రెసిడెంట్ నవీన్ కుమార్,సెక్రటరీ లీలావతి,ట్రెజరర్ మంచాల యాదగిరి,వైస్ ప్రెసిడెంట్ దగ్గుల సుజాత,వైస్ సెక్రెటరీ పాక పద్మావతి,ముఖ్య సలహాదారులు నోముల సుజాత,బొడ్డుపల్లి ఊర్మిళ,సభ్యులు యాద సోమయ్య,కర్లపాటి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులను పరిష్కరించండి

* **జిల్లా జడ్జి మురళి మోహన్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : సెప్టెంబర్ 12న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించాలని మహబూబాబాద్ జిల్లా జడ్జి కె మురళీమోహన్ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ సన్నాహక చర్యల్లో భాగంగా న్యాయమూర్తి బుధవారం ఇతర న్యాయమూర్తులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ రాజి పడదగిన క్రిమినల్ కేసులను,సివిల్ కేసులను త్వరగా గుర్తించి వాటిని లోక్ అదాలత్ లేదా మధ్యవర్తిత్వ కేంద్రానికి పంపించడం ద్వారా రాజీ మార్గంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిట్ఫండ్ కంపెనీలు, బ్యాంకులు తదితర ఆర్థిక సంస్థలు దాఖలు చేసిన రుణ వసూలు కేసులు,చెక్ బౌన్స్ కేసులను ఇరు పక్షాల వారితో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పరిష్కరించేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు శాలిని షాకెల్లి,స్వాతి మురారి,కృష్ణ తేజ్ లు పాల్గొన్నారు.తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి ధీరజ్ కుమార్ దృశ్య మాధ్యమం ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

## జీవో 97 రద్దు చేయాలంటూ పాలిటెక్నిక్ విద్యార్థుల వినూత్న నిరసన

* **ప్రభుత్వ జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలి.**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను 'శక్తి' శాఖలో విలీనం చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ హుస్నాబాద్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మానవహారంగా ఏర్పడి కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఐటీఐ, పాలిటెక్నిక్ విభాగాలను శక్తి శాఖలో విలీనం చేయడం వల్ల విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు.పాలిటెక్నిక్ విద్య పూర్తిచేసిన అనంతరం బీటెక్‌లో ప్రవేశాలకు సీట్ల సంఖ్య పెంచాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. శక్తి పథకాన్ని అమలు చేయడం కంటే పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉన్నత విద్యలో మెరుగైన అవకాశాలు కల్పించాలని కోరారు. విద్యాశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి స్పందించి విలీన ప్రక్రియను ఉపసంహరించుకుని జీవో 97ను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ పెంచడంతో పాటు పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని, కళాశాల తరగతులు పరీక్షలు బహిష్కరిస్తామని విద్యార్థులు తెలిపారు.

## ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు



ప్రజాస్ఫూర్తి, జన్నారం: జన్నారం మండల ఫోటో , వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం 187వ ప్రపంచ ఫోటోగ్రఫి దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల గౌరవ అధ్యక్షులు కస్తూరి ప్రభాకర్ ఫోటోగ్రఫి జెండాను ఆవిష్కరించారు.అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ... ఫోటోగ్రఫి రంగానికి చేస్తున్న సేవలను గుర్తు చేసుకుంటూ సమాజంలో అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పోతూ వేణుగోపాల్, మండల అధ్యక్షులు దుమల్ల ప్రశాంత్,ప్రధాన కార్యదర్శి ఉపారపు శేఖర్,ఉపాధ్యక్షులు గుగ్లవాత్ వసంత్ తో పాటు సభ్యులు పవన్ చారి, మహేష్, సురేష్, రాజేందర్, నరేష్, శేఖర్, వెంకటేష్, సాయితేజ, అనిల్, రవి, రాకేష్, లక్ష్మణ్ తదితర ఫోటో మరియు వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం

* **ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఫైర్**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. గతంలో అధికారం అనుభవించిన నాయకులు ప్రజల సమస్యలు పట్టించుకోకుండా ఇప్పుడు ఎన్నికలు సమీపించగానే సోషల్ మీడియా వేదికగా రాజకీయాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కళ్లుండి కూడా అభివృద్ధి కనిపించకపోవడం బీఆర్ఎస్ నాయకుల రాజకీయ అంధత్వానికి నిదర్శనం. భువనగిరి నియోజకవర్గంలో దాదాపు రూ.1,500 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రోడ్లు, తాగునీరు, సాగునీరు, కాల్వలు, బ్రిడ్జిలు ఇలా ప్రతి రంగంలో పనులు వేగంగా సాగుతున్నాయి" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, ముఖ్యమంత్రి పాదయాత్ర సందర్భంగా మూసీపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయించామని తెలిపారు. దుబాయ్‌లో కూర్చొని సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వంపై విమర్శలు చేయడం కాదు.. మీ నియోజకవర్గానికి వచ్చి ప్రజల మధ్య నిలబడి మాట్లాడే ధైర్యం ఉందా? అని బీఆర్ఎస్ నాయకులను ఎమ్మెల్యే ప్రశ్నించారు.కేటీఆర్, హరీశ్ రావు విమర్శలు చేయాలనుకుంటే నిర్మాణాత్మకంగా చేయాలని, కానీ అభివృద్ధిపై అసత్య ప్రచారం చేస్తే ప్రజల ముందు వాస్తవాలతో సమాధానం చెబుతామని హెచ్చరించారు. మీరు చేసిన అభివృద్ధి ఎంత? మేము చేసిన అభివృద్ధి ఎంత? మీడియా సాక్షిగా బహిరంగ చర్చకు రండి. తేదీ, సమయం మీరు నిర్ణయించండి.. నేను సిద్ధం. మీరు సిద్ధమా?" అంటూ బీఆర్ఎస్ నాయకులకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సవాల్ విసిరారు.ప్రజలు అమాయకులు కాదని..ఎవరు ప్రజల కోసం పనిచేస్తున్నారో, ఎవరు ఎన్నికల సమయంలో మాత్రమే కనిపిస్తున్నారో ప్రజలకు స్పష్టంగా తెలుసు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు ఇచ్చిన తీర్పు ఇంకా మర్చిపోలేదని అన్నారు. సోషల్ మీడియాలో ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా వాస్తవాలను దాచలేరని, అభివృద్ధి పనులే కాంగ్రెస్ ప్రభుత్వానికి సమాధానం..ప్రజల తీర్పే బీఆర్ఎస్‌కు అంతిమ సమాధానం అని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు *ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగెళ్లపల్లి వాణి రవికుమార్ నాయకులు బర్రె జాంగిర్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు వలిగొండ మండల పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చెరుకు శివయ్య గౌడ్ నాయకులు సామ రామ్ రెడ్డి కాసుల వెంకన్న చిలుకూరు సత్తిరెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రతి బిజెపి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి

* **బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్**




హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ మండల భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సమావేశం బిజెపి మండల అధ్యక్షుడు బుక్యా సంపత్ నాయక్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ హాజరై పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశ అభివృద్ధి సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని కోరారు కేంద్ర ప్రభుత్వ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని అన్నారు బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్య ఉండాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మండల ప్రభారీ తోట స్వరూప, రాష్ట్ర నాయకురాలు లక్కిరెడ్డి తిరుమల, అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డిబిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వేంకటేశం జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల కుమారస్వామి ఎస్టిమోర్చా జిల్లా అధ్యక్షుడు నునవాత్ మోహన్ నాయక్,దళితమోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్ తో పాటుగా హుస్నాబాద్ మాజీ మండల అధ్యక్షులు చెక్క బండి విద్యాసాగర్ రెడ్డి వెళ్లండి రాజేంద్రప్రసాద్ ఓ బిసి మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు బొమ్మగాని సతీష్ మాజీ మండల ప్రధాన కార్యదర్శి బొల్లి శ్రీనివాస్ లావుడియా రాజన్ నాయకమండల పార్టీ ప్రధాన కార్యదర్శులు బైరి అరుణ్ తడిసిన రత్నాకర్ రెడ్డి ఉపాధ్యక్షులు కుంట మల్లయ్య చంద్రశేఖర్ రెడ్డి బూతు గడ్డ బాలరాజు కోశాధికారి కనకట్ల కిషనుమండల భూత అధ్యక్షులు బొల్లి సుధాకర్ మెరుగురవీందర్ శ్రీ రాములు పోలు సందీప్ గంటల రాజేందర్ బాలరాజు ఇస్లావత్ తిరుపతి గీకు సంతోష శ్రీనివాస్ రెడ్డి బొమ్మగాని ఈశ్వర్ బొమ్మగాని జగన్నాథం నేల్లి ఇటిక్యాల కుమారస్వామి పిట్టల సంతోష్ కన్నె శంకర్ పోలవేణి శ్రీనివాస్ పోలు శ్రీనివాస్ కార్యకర్తలు మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాకతీయ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రాఫర్ దినోత్సవం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా,ప్రజా స్ఫూర్తి : ప్రపంచ ఫోటోగ్రాఫర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకతీయ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ పత్రికల్లో పనిచేస్తున్న సీనియర్ ఫోటోగ్రాఫర్లు పాలకుర్తి మధు, బండ మోహన్, తోట శ్రీనివాస్‌లను బుధవారం కాకతీయ ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టు మిత్రుల సమక్షంలో టీయూడబ్ల్యుజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్‌కుమార్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. "ఫోటోగ్రాఫర్లు సమాజానికి కళ్లలాంటి వారని,ఒక ఫోటో వెయ్యి పదాలకంటే ఎక్కువ ప్రభావాన్ని చూపుతుందని, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే చిహ్నంగా ఫోటో నిలుస్తుందన్నారు. ప్రజల సమస్యలు, సంఘటనలను కెమెరాలో బంధించి చరిత్రగా నిలిపే ఫోటోగ్రాఫర్ల సేవలు అభినందనీయం" అన్నారు. ఎండ, వాన, చలి లెక్కచేయకుండా విధులు నిర్వర్తిస్తూ వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువస్తున్న ఫోటోగ్రాఫర్లను సమాజం గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లందరికీ ప్రపంచ ఫోటోగ్రాఫర్ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శ్యామల శ్రీనివాస్, భూమిరెడ్డి శేఖర్, నాని, సాంబయ్య, ప్రవీణ్, పవన్, దేవేందర్, మాచర్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ నిధులు పక్కదారి మళ్లిస్తే కఠిన చర్యలు

* **ఎస్సీ, ఎస్టీల హక్కులు, సంక్షేమంపై కమిషన్ సమీక్ష**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక కింద మంజూరైన నిధులను ఇతర అవసరాలకు మళ్లిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి గ్రామంలో సివిల్ రైట్స్ డేను సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు హక్కులు, చట్టపరమైన రక్షణలు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో అవసరమైన ప్రాంతాల్లో పంచాయతీ లేదా సీఎస్ఆర్ నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ కమిషన్ సూచనల మేరకు బాధితులకు ఇళ్ల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని, ప్రతి నెల పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఎస్పీ సంకీర్త్ మాట్లాడుతూ అఘాయిత్యాలపై తక్షణమే కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని చెప్పారు.సమావేశంలో కమిషన్ సభ్యులు కుసురం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, అదనపు ఎస్పీ నరేష్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ గని మూసివేతకు ప్రాధాన్యం

* **42 గనుల మూసివేత చారిత్రక మైలురాయి**
* **105 గనుల మూసివేత లక్ష్యం: కిషన్‌రెడ్డి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి : బొగ్గు గనుల తవ్వకాలతో పాటు పర్యావరణ పరిరక్షణ, గని మూసివేత అనంతరం భూముల సుస్థిర వినియోగం, స్థానికులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పనకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.బుధవారం ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం అనంతరం తొలిసారిగా 42 బొగ్గు గనులను శాస్త్రీయంగా మూసివేయడం చారిత్రక మైలురాయన్నారు. భవిష్యత్‌లో 105 గనులను శాస్త్రీయ పద్ధతిలో మూసివేయడమే లక్ష్యమన్నారు. గని మూసివేత కేవలం తవ్వకాలు నిలిపివేయడం కాదని, పర్యావరణ పునరుద్ధరణ, భూముల సుస్థిర వినియోగం, స్థానికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనతో కూడిన ప్రక్రియ అని తెలిపారు. 2025 జనవరి 31న జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 2028-29 నాటికి గని మూసివేత ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.

## ఈ నెల 22న శ్రీ అభయాంజనేయ స్వామివారి చతుర్ధ వార్షికోత్సవం

జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : చింతల్ డివిజన్ పరిధిలోని శ్రీసాయికాలనీ లో గల శ్రీ అభయాంజనేయ స్వామివారి చతుర్ధ వార్షికోత్సవం ఈ నెల 22 శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న సాయంత్రం 6 గంటలనుంచి 8 గంటల వరకు సామూహిక కుంకుమార్చనపూజ, 22న ఉదయం 8గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కలశారాధన, మన్యుసూక్త హోమం, మూల మంత్రహోమం, పూర్ణాహుతి, ఉదయం 10గంటలకు శ్రీ అభయాంజనేయస్వామి వారికిశత ఘటాభిషేకం, సహస్ర నాగవల్లీ దళార్చన, దూప దీప నివేదన, హారతులు, మంత్ర పుష్పం, భక్తులకు తీర్ధ ప్రసాద వితరణ ,శ్రీ పోచమ్మ అమ్మవారి సన్నిధిలో ఉదయం 8 గంటలకు గణపతి పూజ,పుణ్యాహవచనం,కలశారాదన, చండీ హోమం, అభిషేకం, అలంకరణ, అష్టోత్తర పూజ,దూప దీపనివేదన, మంత్రపుష్పం, తీర్ధ ప్రసాదవితరణ ఆశీర్వచనముమధ్యాహ్నం 1గంటలకు అన్నదాన కార్యక్రమం,సాయంత్రం 6 గంటలకుఉరేగింపు సేవకార్యక్రమంఉంటుందనితెలిపారు.

## త్వరలో పోలీస్ శాఖలో బదిలీలు

**ప్రస్తుతం నలుగురు సీఐల బదిలీ**

ప్రజాస్ఫూర్తి, సూర్యపేట : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు ఇన్స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ శ్వేత ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్ వరంగల్లో పనిచేస్తున్న కె. ఫణీధరను నెక్కొండ సీఐగా నియమించారు. నెక్కొండ సీఐ శ్రీనివాస్ను వీఆర్ వరంగల్ కు బదిలీ చేశారు. వీఆర్ వరంగల్లోని జె.శంకర్ రావును నర్సంపేట రూరల్/ దుగ్గొండి సీఐగా, అక్కడి ఎం.సాయి రమణను వీఆర్ వరంగల్ కు బదిలీ చేశారు.

## బిఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి సమక్షంలో వ క్యాంపు కార్యాలయంలో బుధవారం నల్గొండ మండలం చందనపల్లి గ్రామం కు చెందిన 200 మందికాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ ఎంపీటీసీ పెద్ది ఇందిరమ్మ వెంకటయ్య ఆధ్వర్యంలోమాజీ సర్పంచ్ సురిగి మణెమ్మ రమేష్ తోపాటు పెద్ద ఎత్తున బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ కంచర్ల గులాబీ కండువాలు తప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కల్లుగీత కార్మిక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కటికం సత్తయ్య గౌడ్.. మండల పార్టీ అధ్యక్షులు దేప వెంకట్ రెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్.. మాజీ ఎంపీపీ నారాబోయిన బిక్షం మాజీ జడ్పిటిసి తుమ్మల లింగస్వామి, జి ఎడవెల్లి సింగిల్ విండో చైర్మన్ ధోటి శ్రీనివాస్ జిల్లా సర్పంచుల జేఏసీ చైర్మన్ మేకల పల్లవి అరవింద్ రెడ్డి, సల్వాది సైదులు,జిల్లెల రేణుక రాజు, రేఖల మౌనిక, తీగల యాదయ్యమండల పార్టీ కార్యదర్శి బడుపుల శంకర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ తవిటి కృష్ణ, పొగాకు గట్టయ్య,మాజీ సర్పంచులు గుండెబోయిన జంగయ్య,ఎలుక శ్రీనివాస్ రెడ్డి పంతంగి శ్రీనాథ్, కోట్ల జయపాల్ రెడ్డినారగోని నరసింహ, దశరథ,తదితరులు పాల్గొన్నారు.పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ సురిగి మణెమ్మ రమేష్, తంతెనపల్లి శంకర్ పగిడిపాల వెంకన్న చింత ఇంద్రయ్య పొడిచేటి గోపాల్ ఉప్పలపాటి పవన్ కళ్యాణ్ తంతనపల్లి సాలయ్య కంభంపాటి సందీప్ జక్కలి రాములు తంతెనపల్లి స్వామి సురేష్ రవి చిన్న శంకర్ పాలడుగు శంకర్ తెల్లమల్ల చంటి తో పాటు 200 మందికి పైగా బిఆర్ఎస్ పార్టీలో చేరారు.

## రేగొండలో 444.75 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజా స్ఫూర్తి: రేగొండ మండలంలోని పాత రైస్‌మిల్ గోదాంలో అక్రమంగా నిల్వ ఉంచిన 444.75 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సివిల్ సప్లైస్, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా స్వాధీనం చేసుకున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం రాత్రి సుమారు 7 గంటలకు సివిల్ సప్లైస్ ఇన్‌స్పెక్టర్ రాజు పాత రైస్‌మిల్ గోదాంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అక్కడ పెద్ద మొత్తంలో బియ్యం బస్తాలు గుర్తించడంతో విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం డీఎం అండ్ డీఎస్ఓ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, బియ్యం పీడీఎస్‌కు సంబంధించినదిగా ప్రాథమికంగా నిర్ధారించారు. బుధవారం ఉదయం పంచనామా నిర్వహించి బియ్యం బస్తాలను లెక్కించి తూకం వేయగా 444.75 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భద్రత కోసం మారుతి ఇండస్ట్రీస్ రైస్‌మిల్ వద్ద నిల్వ ఉంచారు.ఈ దాడిలో సివిల్ సప్లైస్ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ అసిస్టెంట్ రాహుల్, డీసీఎస్ఓ, డీఎం సివిల్ సప్లైస్, రేగొండ ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు. కేసులో వాహన యజమాని కమ్ డ్రైవర్ తూర్పాటి శ్రీనివాస్, సాంబశివుడు, పాత రైస్‌మిల్ గోదాం యజమాని శ్రీనివాస్ తదితరుల ప్రమేయంపై అధికారులు విచారణ చేపట్టారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, రవాణా చేయడం, దారి మళ్లించడం చట్టరీత్యా నేరమని అధికారులు తెలిపారు.



# వేరొకరి ఇయర్ బడ్స్ వాడుతున్నారా.?

**ఇది తెలిస్తే ఇంకోసారి ఆ జోలికి వెళ్లరు..**

నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్ ఫోన్ వాడే ప్రతి ఒక్కరి వద్ద బ్లూటూత్ ఇయర్‌ఫోన్స్ లేదా ఇయర్ బడ్స్ కచ్చితంగా ఉంటున్నాయి. ప్రయాణాల్లో ఉన్నప్పుడైనా, ఆఫీసుల్లో పనిచేస్తున్నప్పుడైనా పాటలు వినడానికి లేదా ఫోన్ మాట్లాడటానికి ఇవి ఎంతో సౌకర్యవంతంగా ఉపయోగపడతాయి. అయితే, చాలామంది తమ ఇయర్ బడ్స్ అందుబాటులో లేనప్పుడు లేదా స్నేహితులు పంపిన ఏదైనా ఆడియో వినడానికి వారి ఇయర్ బడ్స్‌ను మార్చుకుని వాడుతుంటారు. ఇలా ఇతరుల బ్లూటూత్ ఇయర్‌ఫోన్స్ లేదా ఇయర్ బడ్స్ వాడటం అనేది అత్యంత ప్రమాదకరమని, ఇది నేరుగా చెవి ఇన్ఫెక్షన్లను కొనితెచ్చుకోవడమేనని వైద్యులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఒకరి ఇయర్ బడ్స్‌ను మరొకరు పంచుకోవడం అనేది తీవ్రమైన అపరిశుభ్రమైన అలవాటు. ఇది ఎంత అసహ్యకరమైన అలవాటంటే, వేరొకరు వేసుకుని చెమట పట్టిన సాక్సులను మనం వేసుకోవడం కంటే కూడా ఘోరమైనదని వైద్యులు పోల్చి చెబుతున్నారు. సాధారణంగా ప్రతి ఒక్కరి చెవి లోపలి భాగంలో కొంత శాతం సహజమైన బ్యాక్టీరియా, వ్యాక్స్, ఫంగస్ ఉంటాయి. ఇవి ఆయా వ్యక్తుల శరీర తత్వానికి అనుగుణంగా ఉంటాయి. అయితే, మనం ఇతరుల ఇయర్ బడ్స్‌ను మన చెవిలో పెట్టుకున్నప్పుడు, వారి చెవిలో ఉండే ఆ ప్రమాదకరమైన బ్యాక్టీరియా, ఫంగస్ కణాలు ఆ ఇయర్ బడ్స్ ద్వారా నేరుగా మన చెవిలోకి ప్రవేశిస్తాయి.

ఇలా ఇతరుల బ్యాక్టీరియా మన చెవిలో చేరడం వల్ల చెవి లోపలి భాగంలో తీవ్రమైన అలర్జీలు, ఇన్ఫెక్షన్లు దారితీస్తాయి. దీనివల్ల చెవిలో భరించలేనంత తీవ్రమైన దురద, విపరీతమైన నొప్పి, చెవిలో నుంచి పసుపు రంగు ద్రవాలు కారడం లాంటి సమస్యలు తలెత్తుతాయి. సమస్య మరింత తీవ్రమైతే అది వినికిడి లోపానికి కూడా దారితీసే ప్రమాదం ఉందని వైద్యులు అప్రమత్తం చేస్తున్నారు. అందుకే పర్సనల్ హైజీన్లో భాగంగా ఇయర్ బడ్స్ అనేవి కేవలం మీ వ్యక్తిగత అవసరాలకు మాత్రమే పరిమితం కావాలి. 'మీ ఇయర్ బడ్స్‌ను ఎవరికీ ఇవ్వకండి, ఇతరులవి మీరు అస్సలు వాడకండి' అని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో వేరొకరిది వాడాల్సి వచ్చినా లేదా మీ ఇయర్ బడ్స్‌ని ఇతరులు వాడినా.. వాటిని తిరిగి ఉపయోగించే ముందు శానిటైజర్ లిక్విడ్ లేదా ఆల్కహాల్ వైప్స్‌తో పూర్తిగా క్లీన్ చేసిన తర్వాతే వాడటం సురక్షితం.



# ఫుల్ ప్రోటీన్ తో అందరికి నచ్చే ఎనర్జీ డ్రింక్..

**రోజూ ఉదయాన్నే తీసుకున్నారంటే తిరుగులేని ఆరోగ్యం మీ సొంతం!**

ఇటీవలి కాలంలో మఖానా ఒక సూపర్ ఫుడ్‌గా ప్రాచుర్యం పొందింది. వీటిని కేవలం విడిగా వేయించుకుని తినడమే కాకుండా, పాలల్లో నానబెట్టి తీసుకోవడం వల్ల శరీరానికి రెట్టింపు పోషకాలు అందుతాయని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. పాలల్లో నానబెట్టిన మఖానా తినడం వల్ల కలిగే ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు, వాటిని ఎలా తీసుకోవాలో ఇప్పుడు తప్పక తెలుసుకోవాలి.

నేటి కాలంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి రకరకాల ఆహారాలు తింటారు. కొందరు తమ ఆహారంలో మఖానాను కూడా చేర్చుకుంటారు. ఇటీవలి కాలంలో మఖానా..తామర గింజలు లేదా ఫాక్స్ నట్స్ అనేది ఒక సూపర్ ఫుడ్‌గా ప్రాచుర్యం పొందింది. ఆరోగ్యానికి పోషకమైన మఖానా, సహజంగా శరీరాన్ని ఆరోగ్యంగా, బలంగా ఉంచడానికి సహాయపడుతుంది. అందుకే మఖానాను పోషకాల గనిగా పరిగణిస్తారు. మఖానా తినడం వల్ల బలహీనమైన ఎముకలకు శక్తి లభిస్తుంది. వీటిని కేవలం విడిగా వేయించుకుని తినడమే కాకుండా, పాలల్లో నానబెట్టి తీసుకోవడం వల్ల శరీరానికి రెట్టింపు పోషకాలు అందుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పాలల్లో నానబెట్టిన మఖానా తినడం వల్ల కలిగే ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు ఇవే..

**ఎముకలు, కండరాల బలం:**

మఖానా, పాలు రెండింటిలోనూ కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఎముకలను, పళ్ళను దృఢంగా ఉంచడమే కాకుండా ఆస్టియోపోరోసిస్ (ఎముకల బలహీనత) ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అలాగే, ఇందులోని హైప్రోటీన్ కండరాల పెరుగుదలకు, కణజాలాల మరమ్మత్తుకు ఎంతగానో తోడ్పడుతుంది.

**రోగనిరోధక శక్తి పెరుగుతుంది:**

మఖానాలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి పాలలోని అవసరమైన విటమిన్లు, ఖనిజాలతో కలిసి శరీర రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. దీనివల్ల సీజనల్ వ్యాధులు, ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా శరీరం సురక్షితంగా ఉంటుంది.

**గుండె ఆరోగ్యానికి మేలు:**

మఖానాలో కొలెస్ట్రాల్, సోడియం శాతాలు చాలా తక్కువగా ఉంటాయి. ఇది రక్తపోటును (బిపి) అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. పాలతో కలిసి ఇది గుండె పనితీరును మెరుగుపరిచి, గుండె జబ్బుల ముప్పును తగ్గిస్తుంది.

**జీర్ణక్రియ మెరుగుపడుతుంది:**

మఖానాలో ఉండే పీచు పదార్థం (ఫైబర్) మలబద్ధకం సమస్యను నివారిస్తుంది. పాలు జీర్ణవ్యవస్థను ప్రశాంతంగా ఉంచి, ప్రేగుల కదలికలను క్రమబద్ధీకరిస్తాయి. ఇది శరీర మెటబాలిజంను కూడా పెంచుతుంది.

**బరువు తగ్గడానికి, చర్మ సౌందర్యానికి:**

ఈ ఆహారం తిన్న తర్వాత ఎక్కువ సమయం ఆకలి వేయకుండా కడుపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది. దీనివల్ల అనవసరమైన క్రేవింగ్స్ తగ్గి, బరువు సులభంగా అదుపులోకి వస్తుంది. అలాగే, మఖానాలోని యాంటీ ఏజింగ్ గుణాలు, పాలలోని హైడ్రేటింగ్ గుణాలు కలిసి ముడతలను తగ్గించి, చర్మాన్ని ప్రకాశవంతంగా, యవ్వనంగా ఉంచుతాయి.

**కిడ్నీల ఆరోగ్యానికి రక్షణ:**

మఖానా సహజ డిటాక్సిఫైయర్‌గా పనిచేసి శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపుతుంది. పాలు శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుతూ, మూత్రపిండాలు (కిడ్నీలు) ఆరోగ్యంగా పనిచేసేలా చేస్తాయి. పోషకాల గని అయిన ఈ నానబెట్టిన మఖానాను మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా పూర్తి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు.






# నిద్రలేచిన తర్వాత ఎలా గడపాలో తెలుసా?

**హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్స్‌కు చెందిన న్యూరాలజిస్ట్ డాక్టర్ సుధీర్ కుమార్ ఏం చెబుతున్నారంటే.. ఉదయం వేళల్లో కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం ద్వారా శరీరంలోని సిర్కాడియన్ రిథమ్‌ను సమతుల్యం చేసుకోవచ్చు. దీంతో శరీరం సహజమైన శక్తిని పొందడమే కాకుండా, మెరుగైన నిద్ర కూడా లభిస్తుంది.**

ఉదయాన్నే సూర్యరశ్మిని ఆస్వాదించండి

నిద్రలేచిన 30 నుంచి 60 నిమిషాలలోపు కనీసం 10 నుంచి 20 నిమిషాల పాటు సహజ సూర్య కాంతిలో గడపాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇది శరీరంలో కార్టిసాల్ హార్మోన్ సమతుల్యంగా విడుదల కావడానికి సహాయపడుతుంది. ఫలితంగా రోజంతా ఉత్సాహంగా, చురుకుగా ఉండగలుగుతారు.

**నిద్రలేవగానే కాఫీకి దూరంగా ఉండండి**

చాలామంది నిద్రలేవగానే టీ లేదా కాఫీ తాగే అలవాటు కలిగి ఉంటారు. అయితే శరీరం సహజంగా మేల్కొనే ప్రక్రియకు సమయం ఇవ్వడం అవసరం. అందుకే కనీసం 60 నుంచి 90 నిమిషాల తర్వాత కాఫీ లేదా టీ తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

**ముందుగా నీళ్లు తాగండి**

రాత్రంతా నిద్రపోవడం వల్ల శరీరంలో కొంత మేర నీటి లోపం ఏర్పడుతుంది. అందువల్ల ఉదయం లేవగానే సుమారు 500 మిల్లీలీటర్ల నీరు తాగడం ద్వారా శరీరానికి తేమను అందించవచ్చు. ఇది జీవక్రియలను చురుకుగా చేయడంలో కూడా సహాయపడుతుంది.

**తేలికపాటి వ్యాయామం చేయండి**

ఉదయం కొద్దిసేపు నడవడం, ఒళ్ళు విరుచుకోవడం లేదా తేలికపాటి స్ట్రెచింగ్ చేయడం ద్వారా శరీరం చురుకుదనాన్ని పొందుతుంది. ఇది మెదడుకు రోజు ప్రారంభమైందనే సంకేతాన్ని పంపి ఏకాగ్రత, శక్తిని పెంచుతుంది. నిద్రలేవగానే సోషల్ మీడియా, మెసేజ్‌లు లేదా ఈమెయిల్స్ చూడడం వల్ల ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అందువల్ల ఉదయం మొదటి గంటలో మొబైల్ వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించడం మంచిది.

**స్నూజ్ బటన్ నొక్కకండి**

అలారం మోగిన ప్రతిసారి స్నూజ్ బటన్ నొక్కడం వల్ల మెదడు మళ్లీ నిద్రలోకి వెళ్లే ప్రయత్నం చేస్తుంది. దీంతో అలసట, నీరసం పెరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి అలారం మోగగానే లేవడం ఉత్తమం.

**పోషకాలు ఉన్న అల్పాహారం తీసుకోండి**

ఉదయం అల్పాహారం రోజంతా శక్తిని అందించే ముఖ్యమైన భోజనం. అధిక చక్కెర కలిగిన ఆహారాలకు బదులుగా ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన శక్తి అందుతుంది.

**ఆరోగ్యకరమైన ఉదయమే ఆరోగ్యకరమైన రోజుకు పునాది**

ఉదయం వేళల్లో ఈ సాధారణ అలవాట్లను పాటించడం ద్వారా శరీర ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, మంచి నిద్ర కూడా పొందవచ్చు. చిన్న మార్పులతో పెద్ద ఆరోగ్య ప్రయోజనాలు పొందాలంటే ప్రతి రోజును ఆరోగ్యకరమైన ఉదయంతో ప్రారంభించడం అవసరం.



# రితికా పక్కా ప్లాన్!

టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసు కెళ్తున్న రితికా నాయక్.. కథ, పాత్రకు ప్రాధా న్యమిస్తూ సినిమాలను ఎంచుకుంటున్నట్లు తెలుస్తోంది. 'అశోక వనంలో అర్జున కళ్యాణం', 'హాయ్ నాన్న', 'మిరాయ్', 'కొరియన్ కనక రాజు' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. వచ్చిన ప్రతి అవకాశానికీ ఓకే చెప్పకుండా ఆచితూచి అడుగులు వేస్తోంది. తెరపై తన పాత్రకు ప్రత్యేకత ఉండేలా చూసుకుంటున్నట్లు సమాచారం. సినిమాల సంఖ్య కంటే తాను పోషించే పాత్రలే ప్రేక్షకులపై ఎక్కువకాలం ప్రభావం చూపుతాయని రితికా భావిస్తోందట. ప్రస్తుతం తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'డ్యూయెట్'లో నటిస్తోంది. కొత్త కథ, భిన్నమైన పాత్రతో మరోసారి మెప్పించేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం ఉన్న క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకుని సినిమాల ఎంపికలో వేగం పెంచాలనే అభిప్రాయాలు కూడా వినిపి స్తున్నాయి. అయితే తొందరపడకుండా మంచి పాత్రలతో కెరీర్‌ను మరింత బలోపేతం చేసుకో వాలన్నదే రితికా ఆలోచనగా తెలుస్తోంది.



# కొత్త పాలసీ!

తమన్నా భాటియా తన 'నో కిస్సింగ్ పాలసీ'కి గుడ్‌బై చెప్పింది. కథకు అవసరమైతే ఇంటిమేట్ సీన్స్‌లో నటించేందుకు అభ్యంతరం లేదని తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేసింది. 2023లో 'లస్ట్ స్టోరీస్ 2'తో తొలిసారి ఈ రూల్‌ను పక్కన పెట్టిన ఆమె.. నటిగా ఎదిగే క్రమంలో భయం, సంకోచం అడ్డంకులుగా మారకూడదని పేర్కొంది. కథలో కీలకమైన సన్నివేశాలను విడిగా చూడకుండా పాత్రలో భాగంగానే పరిగణించాలని అభిప్రాయం వ్యక్తం చేసింది. ప్రస్తుతం తెలుగులో కథానాయికగా అవకాశాలు తగ్గిన నేపథ్యంలో తమన్నా బాలీవుడ్ వెబ్‌సిరీస్‌లు, ప్రత్యేక పాత్రలు, సాంగ్స్‌పై దృష్టి పెడుతోంది. 'ఓదెల 2'లో కీలక పాత్రలో కనిపించిన ఆమె.. ఇకపై వేగం కంటే పాత్రకే ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తోంది. తమన్నా ప్రస్తుతం తమిళంలో విశాల్ హీరోగా తెరకెక్కుతున్న పురుషన్ మూవీలో నటిస్తోంది.



# తెలుగు బ్రేక్ దక్కేనా?

తమిళంలో గుర్తింపు తెచ్చుకున్న ప్రియా భవానీ శంకర్‌కు తెలుగులో మాత్రం ఇప్పటివరకు సరైన విజయం దక్కలేదు. 'కళ్యాణం కమనీయం', 'భీమా' చిత్రాలు నిరాశపరచడంతో టాలీవుడ్‌లో ఆమెకు బ్రేక్ రాలేదు. ఇప్పుడు రవితేజ కథానాయకుడిగా నటించిన 'ఇరుముడి'పై ప్రియా ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఇందులో రవితేజ భార్య 'కావేరి' పాత్రలో కనిపించనుంది. కుటుంబ నేపథ్యంతో సాగే ఈ పాత్ర తనకు తెలుగులో మంచి గుర్తింపు తెస్తుందని భావిస్తోంది. ఈ సినిమా విజయం సాధిస్తే టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు అందుకునే అవకాశం ఉంది. దీంతో 'ఇరుముడి' ప్రియా భవానీ శంకర్ తెలుగు కెరీర్‌కు కీలకంగా మారనుందా? అన్న ఆసక్తి నెలకొంది.

# సీక్రెట్‌గా ఆయేషా ఎంగేజ్‌మెంట్ చేసుకుందా?

బాలీవుడ్ నటి అయేషా ఖాన్ షేర్ చేసిన తాజా ఫొటోలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. ఓ మిస్టరీ వ్యక్తితో కలిసి దిగిన ఫొటోల్లో ఆమె చేతికి డైమండ్ రింగ్ కనిపించడంతో.. నిశ్చితార్థం జరిగిందా? అనే ఊహాగానాలు మొదలయ్యాయి. దీనికి తోడు 'ఏ డ్రీమ్' అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ ఆసక్తిని పెంచింది. అయితే, ఫొటోల్లో సదరు వ్యక్తి ముఖాన్ని అయేషా పూర్తిగా కనిపించకుండా జాగ్రత్త పడింది. ఆమె ధరించిన ఆభరణాలను బట్టి ఇది జువెలరీ బ్రాండ్ ఫొటోషూట్‌లో భాగమై ఉండొచ్చనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. తన ఎంగేజ్‌మెంట్‌పై అయేషా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో ఆ రింగ్ వెనుక అసలు కథేంటన్నది ఆసక్తికరంగా మారింది.



# టికెట్ల ధరల పెంపు ఆదాయంలో 20% సినీ కార్మికుల సంక్షేమానికి




- **తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు**

భారీ బడ్జెట్ చిత్రాల టికెట్ ధరల పెంపుతో వచ్చే అదనపు ఆదాయంలో 20 శాతాన్ని సినీ కార్మికుల సంక్షేమానికి కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎఫ్‌డీసీ)కు అందజేయాలని స్పష్టం చేసింది. 'పెద్ది', 'రాజాసాబ్', 'మనశంకర వరప్రసాద్ గారు', 'అఖండ 2' తదితర భారీ చిత్రాలకు ఈ నిబంధన వర్తించనుంది. టికెట్ ధరల పెంపుతో వచ్చిన అదనపు వసూళ్లలో 20 శాతాన్ని తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు టీజీఎఫ్‌డీసీ ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని థియేటర్ యాజమాన్యాల నుంచి వసూలు చేసి సంబంధిత ఖాతాల్లో జమ చేసే బాధ్యత నిర్మాతలదేనని ప్రభుత్వం పేర్కొంది. రానున్న భారీ చిత్రాలకూ ఇదే విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించింది. దీంతో సినీ కార్మికుల సంక్షేమానికి మరింత ఆర్థిక సహకారం అందే అవకాశం ఉంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.